ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
ఆదివారం 15 సెప్టెంబరు 2024



గానలహరి

శోభారాజ్ గాత్ర కచేరి

తిరుమల శ్రీవారి ఆలయం ముందు శనివారం సాయంత్రం సహస్రదీపాలంకార సేవలో పద్మశ్రీ శోభారాజ్ సంకీర్తనాలాపన చేశారు. గాయత్రి మంత్రంతో కార్యక్రమాన్ని ప్రారంభించి ఈరూపమై ఉన్నాడు.. ఇతడే పరబ్రహ్మము, కొలిచితే రక్షించే గోవిందుడితడూ.., అను కీర్తనలను మధురంగా ఆలపించి ఆమె భక్తులను ఆకట్టుకున్నారు. - తిరుమల,ఆంధ్రజ్యోతి





కుమ్మరగుంట పొలాల్లో అట్లాస్ మోత్

బంగారువర్ణంలో వున్న ఈ సీతాకోక చిలుక శనివారం చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం వనమలదిన్నె పంచాయతీ కుమ్మరగుంట పొలాల్లో కనిపించింది. కుమ్మరగుంటకు చెందిన మనోహర్ ఉల్లి సాగు చేసిన పొలంలో కన్పించిన ఈ సీతాకోక చిలుక సైజును చూసిన వారు ఆశ్చర్యపోయారు.అట్లాస్ మోత్‌గా పిలిచే ఈ సీతాకోక చిలుక ఒక్కోవైపు రెండు రెక్కలతో పెద్ద పురుగులా కనిపించింది.రైతులు దాన్ని పట్టుకోబోగా మామూలు పురుగువలే రెక్కలు ముడుచుకోవడం, మళ్లీ కొద్దిసేపటికి సీతాకోక చిలుక వలే రెక్కలు విప్పుకోవడం జరిగింది.దక్షిణ భారతదేశంలో ఎక్కువగా ఇది కన్పిస్తుంటుందని తిరుపతికి చెందిన పరిశోధకుడు భూపేష్ గుప్తా తెలిపారు. - పుంగనూరు



పవిత్ర ప్రతిష్ఠ

తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో శనివారం పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారికి సుప్రభాతం, తోమాలసేవ, సహస్రనామార్చన చేశారు. గోవిందరాజ స్వామి, భూదేవి, శ్రీదేవి అమ్మవార్లను యాగశాలకు వేంచేపు చేసి, స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం యాగశాలలో వైదిక కార్యక్రమాల అనంతరం పవిత్ర ప్రతిష్ఠ చేశారు. - తిరుపతి(కల్చరల్)



యాగశాలలో పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

శాస్త్రోక్తంగా ముక్కంటి పవిత్రోత్సవాలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 14: శ్రీకాళహస్తీశ్వరాలయంలో రెండవ రోజు శనివారం పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. నిత్యపూజల్లో జరిగే దోషాలను నివారించి మూలవిరాట్లకు పునరుత్తేజం తెచ్చేలా ఈ పూజలు చేశారు. యాగశాలలో ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో శ్రీ-కాళ-హస్తి ఉత్సవర్లు, భరద్వాజ మహర్షి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి విశేష అభిషేక పూజలు చేపట్టారు. పూర్ణాహారతులు సమర్పించారు. ఆలయాధికారులు పూజా ద్రవ్యాలను సమర్పించారు. ప్రధాన అర్చకులు స్వామినాథన్ గురుకుల్ పాల్గొన్నారు. కాగా, జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

భూ సేకరణలో పరిహారం గోవిందా...



పల్లం వద్ద టీటీడీ ఉద్యోగుల ఇళ్ల స్థలాలకు తీసుకున్న భూములు ఇవి

- చెల్లింపులో వైసీపీ వారికే అగ్రతాంబూలం
- టీడీపీ ముద్రతో పలువురికి అన్యాయం
- లబోదిబోమంటున్న పల్లం బాధిత రైతులు

ఏర్పేడు, సెప్టెంబరు 14: టీడీడీ ఉద్యోగుల ఇళ్ల పట్టాలకు సేకరించిన భూముల వ్యవహారంలో గత వైసీపీ నేతల అడ్డగోలు వ్యవహారం తాజాగా వెలుగు చూసింది. కూటమి ప్రభుత్వం రావడంతో బాధితులు ధైర్యం చేసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తున్నారు. వివరాలు పరిశీలిస్తే.. పారిశ్రామికంగా, విద్యాకేంద్రంగా అభివృద్ధి చెందుతున్న ఏర్పేడు మండలంలో భూముల విలువ పెరిగింది. ఈ క్రమంలో అప్పటి వైసీపీ ప్రభుత్వం తిరుమల తిరుపతి దేవస్థానం ఉద్యోగులకు ఈ ప్రాంతంలో ఇళ్ల స్థలాలను ఇవ్వాలని సంకల్పించింది. అయితే భూ సేకరణలోనే వైసీపీ నాయకులు సొమ్ములు నొక్కేశారు. నాటి అధికారులతో కుమ్మక్కై అసలైన భూయజమానులను దగా చేశారు. పల్లం పంచాయతీ పరిధిలోని 500 ఎకరాలను రెవెన్యూ అధికారులు సేకరించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరుల నుంచి సేకరించిన 330 ఎకరాలకు గాను మొదట విడతగా ఎకరాకు రూ.20లక్షలవంతున వెంటనే పరిహారం చెల్లించారు. ఇందులో వంద ఎకరాల వరకు రెవెన్యూ అధికారుల అండదండలతో దొంగ రికార్డులు సృష్టించి పరిహారం పొందారని సమాచారం. ఎకరాకు రూ.5లక్షలు అధికారులకు ముట్టజెప్పారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అప్పటి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తమ పార్టీ వారికి అనుకూలంగా చక్రం తిప్పారని తెలిసింది.



కొడుకు టీడీపీలో ఉన్నాడని ఇవ్వలేదు

మా అబ్బాయి టీడీపీలో కార్యకర్తగా ఉన్నాడని వైసీపీ ప్రభుత్వంలో మాకు పరిహారం ఇవ్వలేదు. 2004లో అప్పటి ప్రభుత్వం మాకు ఇచ్చిన భూమిని వైసీపీ ప్రభుత్వం తీసుకుంది. పరిహారం కోసం 8 నెలలుగా అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. ఎవరూ స్పందించలేదు.

- ఆదిలక్ష్మి, పల్లం దళితవాడ

జన్మభూమి కమిటీలో ఉన్నానని..

2019 ముందు టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలో ఉన్నాను. అందువల్ల వైసీపీ నేతలు కక్షకట్టి మా గ్రామంలో నాకు పరిహారం ఇవ్వకుండా చేశారు. ఈ ప్రభుత్వం విచారణ చేపట్టి పరిహారం ఇవ్వాలని కోరుతున్నాను.

- పోలమ్మ, పల్లం గిరిజన కాలనీ.



ఇదెక్కడి న్యాయం: 70ఎకరాలకు మాత్రం పైసా కూడా పరిహారం అందించలేదు. కారణం ఈ భూ నిర్వాసితులంతా టీడీపీ సానుభూతిపరులు కావడమే.ఇలా 22మందికి పరిహారం ఇవ్వకుండా అధికారులు కాలయాపన చేశారు. వీరికి 20 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం కుటుంబానికి 1.50 ఎకరా చొప్పున భూపంపిణీ చేసింది. పట్టాదారు పాసుపుస్తకాలు, డీపట్టా కూడా ఉన్నాయి. వెబ్‌ల్యాండ్‌లో నమోదైనట్లు వన్‌బీ కూడా ఉంది. ఇన్ని ఆధారాలున్నా తమకు పరిహారం చెల్లించేదంటూ ఎస్సీ, ఎస్టీ బాధిత రైతులు వాపోతున్నారు. టీడీపీ సానుభూతిపరులం కావడమే తాము చేసిన పాపమా అని ప్రశ్నిస్తున్నారు.

అక్రమాలకు అధికారుల మధ్యవర్తిత్వం

పల్లం దళితవాడకు చెందిన 30మందికి 45 ఎకరాలను ఆన్‌లైన్‌లో మార్పు చేయించుకుని వైసీపీ నేతలు పరిహారం పొందినట్లు సమాచారం. అసలైన రైతులు గగ్గోలు పెట్టకుండా అప్పటి రెవెన్యూ అధికారులు జాగ్రత్తపడ్డారు. పరిహారంలో కొంతమొత్తం చెల్లించేలా రైతులకు, వైసీపీ నేతలకు మధ్య ఒప్పందం కుదిర్చారు. తీరా పరిహారం పొందాక వైసీపీ నేతలు అసలైన రైతుల నోట మట్టికొట్టారు. ఎలాంటి పరిహారమూ ఇవ్వలేదు. బాధిత రైతులు కష్టాన్ని భరించి మౌనం దాల్చారు. టీడీపీ ప్రభుత్వంలో అయినా పరిహారం అందించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



గాయపడిన లోకేశ్

థియేటర్లో విద్యార్థిపై హత్యాయత్నం..

- ఎంబీయూ కళాశాల విద్యార్థికి కత్తిపోట్లు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 14: థియేటర్‌లో సినిమా చూస్తున్న విద్యార్థిపై హత్యాయత్నం చేసిన ఘటన తిరుపతిలో శనివారం చోటుచేసుకుంది. ఈస్ట్ పోలీసుల వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన లోకేష్ ఎంబీయూ(మోహన్‌బాబు యూనివర్సిటీ)లో రెండవ సంవత్సరం పారా మెడికల్ కోర్సు చేస్తున్నాడు. సూళ్లూరుపేటకు చెందిన కావ్య అక్కడే అదే కోర్సు చేస్తోంది. ఇద్దరూ స్నేహంగా ఉండేవారు. శనివారం సినిమాకు పోవాలని నిర్ణయించుకుని ముందు రోజే కావ్య తిరుపతిలోని పీజీఆర్ థియేటర్‌లో టికెట్లు బుక్ చేసింది. ఈ విషయాన్ని తాను ఐదేళ్లుగా ప్రేమిస్తున్న సూళ్లూరుపేటకు చెందిన కార్తీక్‌కు చెప్పి తనను కూడా సినిమాకు రావాలని కోరింది. కార్తీక్ కూడా టికెట్ బుక్ చేసుకుని సినిమాకు వచ్చాడు. లోకేష్ కావ్యతో స్నేహంగా ఉండడం నచ్చని కార్తీక్ తనతో తెచ్చుకున్న కత్తితో పొట్టలో పొడిచి పారిపోయాడు. కావ్య కూడా అతనితో వెళ్లిపోయింది. థియేటర్ యాజమాన్యం ఈస్ట్ పోలీసులకు సమాచారం అందించింది. డీఎస్పీ వెంకటనారాయణ, సీఐ మహేశ్వర రెడ్డి, ఎస్ఐ నాగేంద్రబాబు అక్కడికి చేరుకుని గాయపడిన లోకేష్ ఎంబీయూ విద్యార్థిగా గుర్తించి, తిరుపతి రుయాకు తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. కావ్య, తాను మంచి స్నేహితులమని, ఆమె కార్తీక్‌తో ప్రేమలో ఉన్న విషయం తెలుసునని లోకేష్ ఆస్పత్రిలో పోలీసులకు చెప్పాడు. కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న కార్తీక్, కావ్యల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్లు సీఐ చెప్పారు.





కాణిపాకంలో నేడు

బ్రహ్మోత్సవాల్లో ఆదివారం ఉదయం భిక్షాండి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. తిరుకల్యాణం నిర్వహణకు కాణిపాకం, తిరువణంపల్లెకు చెందిన వణిగ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించనున్నారు. రాత్రి నిర్వహించే అశ్వవాహన సేవకు 44బొమ్మసముద్రం, తిరువణంపల్లె, చింతమాకులపల్లె, కారకాంపల్లెలకు చెందిన గోనగుంట బలిజ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరిస్తారు.

బ్రహ్మరథంపై బొజ్జ గణపయ్య

- కిక్కిరిసిన కాణిపాక వీధులు

ఐరాల(కాణిపాకం),సెప్టెంబరు 14 : కాణిపాక ఆలయ బ్రహ్మోత్సవాల్లో శనివారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.కాకర్లవారిపల్లెకు చెందిన ఎతిరాజులు నాయుడు,శివప్రసాద్ జ్ఞాపకార్థం మీనాకుమారి, కాణిపాకానికి చెందిన మాజీ వీఎం పూర్ణచంద్రారెడ్డి కుటుంబ సభ్యులు, మాజీ వీఎం చంద్రశేఖర రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు హరిప్రసాదరెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. రథోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయంలో ఏర్పాటు చేసిన పుష్పాలంకరణలు, దేవతామూర్తుల ప్రతిమలు ఆకట్టుకున్నాయి.రథోత్సవ సమయంలో ఆలయ సిబ్బంది ధరించిన సైనికుల వేషధారణలు, కీలు గుర్రాలు కూడా అలరించాయి.ఉదయం మూల విరాట్‌కు అభిషేకం నిర్వహించాక అలంకార మండపంలో సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవర్లకు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామిని బ్రహ్మరథంపై ఆశీనులను కావించారు. ఉదయం 7.30 గంటల నుంచి 8.30 గంటల మధ్య సంప్రదాయబద్ధంగా రథాన్ని భక్తులు, ఉభయదారులు కొంతదూరం లాగి భక్తుల దర్శనార్థం ఉంచారు. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులు బ్రహ్మరథంపై ఉప్పు, బొరుగులు, మిరియాలు, చిల్లర నాణేలు చల్లి, కొబ్బరికాయలు సమర్పించి, కర్పూర హారతులతో మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో రథాన్ని కాణిపాకం పురవీధుల్లో ఊరేగించారు.

ఐదేళ్ల తర్వాత శ్రీవారి దర్శనం

- పంతం వీడిన టీడీపీ నేత నరసింహయాదవ్



తిరుమల, సెప్టెంబరు14(ఆంధ్ర జ్యోతి): టీడీపీ తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు, తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్ ఐదేళ్ల తర్వాత కుటుంబ సమేతంగా శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వైసీపీ పరిపాలనను నిరసిస్తూ గత ఐదేళ్లుగా (పార్టీ అధినేత చంద్రబాబు దర్శనానికి వచ్చినప్పుడు మినహా) ఆయన శ్రీవారిని దర్శించుకోలేదు. వైసీపీ పాలనలో అన్యాయాలు, అక్రమాలకు నిరసనగా ఆయన దీక్ష పూనారు. ప్రభుత్వం మారిన తర్వాత శనివారం తన 40వ పెళ్లిరోజు సందర్భంగా ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు. దీక్షను శనివారంతో విరమించుకున్నట్లు నరసింహయాదవ్ తెలిపారు.

21.8కేజీల గంజాయి స్వాధీనం

- పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 14: 21.8కేజీల గంజాయిని పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. తొట్టంబేడు పోలీస్‌స్టేషన్ పరిధిలో కారులో ముగ్గురు వ్యక్తులు గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ప్రత్యేక టాస్క్‌ఫోర్సు బృందం నిఘా పెట్టింది. ముగ్గురు యువకులతో సహా కారును, 21.8కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని తొట్టంబేడు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. దీనివెనుక మూలాలను గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

స్కిట్ కళాశాలకు మంచిరోజులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 14: స్థానిక స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలకు మంచిరోజులు రానున్నాయి. మూడేళ్లుగా మూతబడ్డ కళాశాలను జేఎన్‌టీయూకు అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందుకోసం కమిటీని నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. 2018 అక్టోబరు 26న స్కిట్ కళాశాలను జేఎన్‌టీయూకు అప్పగించేలా అప్పటి ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం స్కిట్‌లో పనిచేస్తున్న సిబ్బందిని తొలగించి, 2021 డిసెంబరు నుంచి తరగతులను నిలిపివేసింది. స్కిట్ కళాశాలకు పూర్వవైభవం తెస్తానని ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆ మేరకు ఆయన చేసిన ప్రయత్నాలు ఫలించాయి. మూడేళ్ల తర్వాత కళాశాలపై కదలిక రావడం పట్ల శ్రీకాళహస్తి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రాణం..తృణప్రాయం

● భాకరాపేట ఘాట్‌లో నెలకు నలుగురి దుర్మరణం ● తాజా ప్రమాదంతో నివారణ చర్యలకు శ్రీకారం



భాకరాపేట ఘాట్ రోడ్డు

చంద్రగిరి, సెప్టెంబరు 14:భాకరాపేట ఘాట్ రోడ్డులో ప్రమాదాలు సాధారణమయ్యాయి. చంద్రగిరి మండల పరిధిలోని తిరుపతి, మదనపల్లె జాతీయ రహదారిలోని ఈ ఘాట్‌మార్గంలో నెలకు సగటున నలుగురు ప్రాణాలు కోల్పోతున్నారంటే తీవ్రత అర్థమవుతోంది. ఈ ఏడాది ఇప్పటివరకూ 40 మంది చనిపోయారు. 66 మంది క్షతగాత్రులయ్యారు. 20 మీటర్ల దూరం తగ్గుతుందనే ఆశతో బెంగళూరు, మదనపల్లె, అనంతపురం, కడప నుంచి ఈదారిలోనే ప్రయాణించి ప్రమాదాల బారిన పడుతున్నారు. పడమటి మండల రైతులు కూడా తమ ఉత్పత్తులను తిరుపతి, చెన్నైలకు ఈమార్గంలోనే రవాణా చేస్తుంటారు. అధిక లోడుతో రావడం, డ్రైవర్లకు మార్గంలోని మలుపులపై అవగాహన లేకపోవడంతో భాకరాపేట ఘాట్ రోడ్డులో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఈ దారిలో మలుపులు సవాలుగా మారుతున్నాయి. ఫలితంగా వాహనాలు అదుపు చేయలేక పోతున్నారు. డ్రైవర్ల నిద్రమత్తు కూడా కొన్ని సందర్భాల్లో ప్రమాదాలకు కారణమవుతోంది.


భాకరాపేట ఘాట్ రోడ్డులో ముళ్ళ కంపలను తొలగిస్తున్న దృశ్యం

ఈ ఏడాది రోడ్డు ప్రమాదాల తీరు(గణాంకాలు)

నెల	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
జనవరి	10	8	15
ఫిబ్రవరి	4	4	0
మార్చి	8	3	8
ఏప్రిల్	6	2	6
మే	6	8	4
జూన్	9	3	9
జూలై	4	3	6
ఆగస్టు	8	5	16
సెప్టెంబరు	3	4	2

నానీ ఆదేశాలతో చర్యలకు శ్రీకారం

భాకరాపేట ఘాట్‌లో ప్రమాదాల కట్టడికి చర్యలు మొదలయ్యాయి. గురువారం జరిగిన రోడ్డు ప్రమాద స్థలాన్ని ఎమ్మెల్యే పులివర్తి నాని సందర్శించి ఫోకస్ పెట్టారు. ప్రమాదాల నివారణకు చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈక్రమంలో శనివారం ఘాట్ రోడ్డుకు ఇరువైపులా వాహనదారులకు రహదారి కనిపించేలా ముళ్ల కంపల తొలగింపు పనులను ప్రారంభించారు. గత ప్రభుత్వంలో అనేక ప్రమాదాలు జరిగినా కంటి తుడుపు చర్యలకే అధికారులు పరిమితమయ్యారు. అప్పటి ప్రభుత్వంలో కీలక మంత్రి ఒకరు ఈదారిలోనే ప్రయాణించినా ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాల కట్టడికి శాశ్వత చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్పీ ప్రత్యేక దృష్టి



ఘాట్ రోడ్డు నివారణకు ఎస్పీ సూచనలు, సలహాలు తెలియజేశారు. ఇదివరకు జరిగిన రోడ్డు ప్రమాదాల ఫోటోలు రాత్రి వేళ కూడా కనిపించేలా రేడియం బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రిటైన్ వాల్‌పై రేడియం స్టిక్కర్లు, రోడ్డు విస్తరణ , ఇరువైపులా ముళ్ళ కంపలు తొలగింపు, రోడ్డుపై సోలార్ బ్లింకింగ్ రెడ్ లైట్స్ ఏర్పాటు చేయడం లాంటి చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. జాతీయ రహదారి, రవాణాశాఖ అధికారులతో కలిసి చర్యలు తీసుకొంటాం. - సుబ్బరామిరెడ్డి, సీఐ, చంద్రగిరి

17న తిరుమలలో అనంత పద్మనాభ వ్రతం

తిరుమల, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈనెల 17న అనంత పద్మనాభ వ్రతాన్ని టీటీడీ ఘనంగా నిర్వహించనుంది. ఈసందర్భంగా ఉదయం 6 గంటలకు శ్రీవారి సుదర్శన చక్రత్తాళ్వారును ఆలయం నుంచి ఊరేగింపుగా వరాహస్వామి ఆలయం పక్కన ఉన్న పుష్కరిణి చెంతకు అర్చకులు ఆగమోక్తంగా తీసుకువెళ్లి పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారు. శ్రీవారి సుదర్శన చక్రత్తాళ్వార్లకు పుష్కరిణిలో అభిషేకాదులు నిర్వహించి తిరిగి ఆలయానికి వేంచేపు చేస్తారు. అనంతుడు అంటే ఆదిశేషుడు. ఆదిశేషుడిపై అనంతపద్మనాభస్వామి అవతారంలో ఉన్న మహావిష్ణువును ప్రార్థిస్తూ గృహస్థులు సౌభాగ్యం కోసం ఈవ్రతాన్ని ఆచరిస్తారు. మహావిష్ణువు అనంతకోటి రూపాల్లో వేంకటేశ్వరస్వామి తరహాలోనే శయనమూర్తిగా అనంత పద్మనాభస్వామికి అంతే వైశిష్ట్యం ఉంది. ఏటా ఈపర్వదినాన దేశవ్యాప్తంగా 108 వైష్ణవ దివ్యక్షేత్రాల్లో అనంతపద్మనాభ వ్రతం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈక్రమంలో అనంత పద్మనాభ వ్రతాన్ని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో కేంద్రమాజీ మంత్రి కిల్లి కృపారాణి, ఏపీ మాజీ డిప్యూటీసీఎం నారాయణస్వామి, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరావు, ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు, ఎంఎల్సీలు కల్యాణి, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, మాజీ డీజీపీ ప్రభాకర్‌రావు, తెలంగాణ మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. దర్శనం అనంతరం కారుమూరి నాగేశ్వరరావు ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రాన్ని సస్యశామలంగా ఉంచడంతో పాటు అందరికి మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరినట్టు చెప్పారు. ప్రశాంత వాతావరణంలో న్యాయమైన పరిపాలన అందించే మనసు నాయకులకు ఇవ్వాలని ప్రార్థించానన్నారు.

రేపటి నుంచి పద్మావతీ పవిత్రోత్సవాలు

తిరుచానూరు, సెప్టెంబరు 14: తిరుచానూరు పద్మావతీ అమ్మవారి ఆలయంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఆదివారం సాయంత్రం విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం ఉంటాయి. సోమవారం పవిత్ర ప్రతిష్ఠ, మంగళవారం పవిత్ర సమర్పణ, బుధవారం పూర్ణాహుతితో ఉత్సవాలు ముగుస్తాయి. రూ.750 చెల్లించి గృహస్థులు(ఒకరికి ఒకరోజు) పవిత్రోత్సవాల అర్జిత సేవల్లో పాల్గొనవచ్చు. 2 లడ్డూలు, 2 వడలు అందజేస్తారు.

పలు ఆర్జిత సేవలు రద్దు : అంకురార్పణ సందర్భంగా ఆదివారం కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, 16న అష్టదళ పాద పద్మారాధన సేవలను రద్దు చేశారు. 16, 17, 18 తేదీల్లో కల్యాణోత్సవం, బ్రేక్ దర్శనం, వేదాశీర్వచనం, కుంకుమార్చన, ఊంజల్ సేవలను టీటీడీ రద్దు చేసింది.

వికసిత్ భారత్ నిర్మాణం బీజేపీ లక్ష్యం


బీజేపీ కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

చంద్రగిరి, సెప్టెంబరు 14: వికసిత్ భారత్ నిర్మాణం ప్రభుత్వ లక్ష్యమే కాకుండా బీజేపీ లక్ష్యంగా కూడా అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు అన్నారు. శనివారం చంద్రగిరిలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వంలో దేశం అభివృద్ధి వైపు అడుగులు వేస్తోందన్నారు. మోది పాలనతో దేశం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలె నాయకులు వెంకటముని, సుబ్రమణ్యంయాదవ్, గాలి పుష్పలత, మునిగంగిరెడ్డి, హరినాథ్ రెడ్డి, శ్రీధరబాబు, సునీల్, తిలక్‌యాదవ్, నరేష్‌కుమార్‌నాయుడు, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి మండల సీఐటీయూ కమిటీ ఎన్నిక

చంద్రగిరి, సెప్టెంబరు 14: మండల సీఐటీయూ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. చంద్రగిరిలో సీఐటీయూ సమావేశం నిర్వహించారు. సమావేశానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వాణిశ్రీ, జిల్లా ఉపాధ్యక్షుడు గండికోట నాగ వెంకటేష్, చినబాబులు హాజరయ్యారు. శ్రీనివాసమంగాపురానికి చెందిన యుగంధర్‌ను కన్వీనర్‌గా, కో-కన్వీనర్‌గా వాణిశ్రీ, సభ్యులుగా నాగభూషణమ్మ, కృష్ణమ్మ, సుహాసిని, నవనీత, మునిరాజమ్మ, చిట్టిబాబు, ప్రకాష్, నరసింహ, సోను, శ్రీదర్, వేదవతిలను ఏకగ్రీవకంగా ఎన్నుకున్నారు.

ఎయిర్ కండిషన్, ఫ్రిజ్ రిపేర్,సర్వీసింగ్‌లో శిక్షణ

చంద్రగిరి, సెప్టెంబరు 14: ద్వారకానగర్‌లోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈనెల 19 నుంచి ఎయిర్ కంగాషన్, ఫ్రిజ్ రిపేరు, సర్వీసింగ్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల గ్రామీణ ప్రాంతాల్లో 19 నుండి 40 సంవత్సరాల మధ్య వయసుండి తెల్ల రేషన్ కార్డు కలిగిన నిరుద్యోగ పురుషులు శిక్షణకు అర్హులన్నారు. కనీసం పదోతరగతి చదివి ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సంస్థ ఫోన్ ద్వారా పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ధ్రువపత్రాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో సంస్థ కార్యాలయానకికి వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్..7989680587, 9494951289, 6301717672 నంబర్లలో సంప్రదించాలన్నారు.

తిరుమల టూటౌన్ ఎస్‌గా చలపతి



తిరుమల, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమల టూటౌన్ ఎస్‌గా చలపతి బాధ్యతలు స్వీకరించారు. తిరుపతిలో వీఆర్‌లో ఉన్న ఆయన్ను తిరుమల టూటౌన్‌కు బదిలీ చేసిన క్రమంలో శనివారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయనకు పలువురు పోలీసు అధికారులు, కానిస్టేబుళ్లు శుభాకాంక్షలు తెలిపారు.

నేటినుంచి మెక్సికో బృందం పర్యటన

తిరుపతి రూరల్, సెప్టెంబరు 14: జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను ఆదివారం నుంచి మంగళవారం వరకు మెక్సికో బృందం సందర్శిస్తుందని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎ.షణ్ముగం పేర్కొన్నారు. ఆదివారం తిరుపతి రూరల్ మండలం వేమూరులోని ఎన్‌పీఎంషాప్‌లో ప్రకృతి వ్యవసాయ ఇన్‌పుట్స్ తయారీ విధానం, వినియోగం, ప్రయోజనాలను గురించి తెలుసుకుంటుందన్నారు. స్వయంసహాయక సంఘాల సభ్యులతో మాట్లాడుతుందన్నారు. సోమవారం చిన్నగొట్టిగల్లు మండలంలో పీఎండీఎస్, ఏటీఎం ఏగ్రేడ్ మోడల్ క్షేత్రాలను, మంగళవారం రామచంద్రాపురం మండలం, కుప్పంబాదూరు పరిధిలో సీకేపల్లె, గొల్లపల్లె గ్రామాల్లో పర్యటిస్తుందని వివరించారు

లింగేశ్వర్‌నగర్‌లో అన్నదానం



తిరుపతి రూరల్, సెప్టెంబరు 14: తిరుపతి రూరల్ మండలం లింగేశ్వర్‌నగర్‌లో వినాయక కమిటీ ఆధ్వర్యంలో శనివారం అన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి, టీజీ కృష్ణయాదవ్, ఆనంద్‌యాదవ్‌లు కలసి దాదాపు వెయ్యిమందికి అన్నదానం చేశారు. కమిటీ సభ్యులు బుజ్జమ్మ, కుట్టి, చందు, శరత్, భరత్, తేజ, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామలో ఘనంగా ఇంజినీర్స్ డే


విద్యార్థికి జ్ఞాపికను అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర

తిరుపతి రూరల్, సెప్టెంబరు14: కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ విభాగ ఆధ్వర్యంలో శనివారం ఇంజినీర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ప్రతిభ చాటిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల ఛైర్మన్ మన్నెం రామిరెడ్డి, డైరెక్టర్స్ మన్నెం రామసుబ్బారెడ్డి, మన్నెం అరవింద్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర, సివిల్‌హెడ్ బి.బాలకృష్ణ, పి.సుజన, మోనిక, సౌజన్య విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.78 కోట్లు

తిరుమల, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.78 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది.

విద్యార్థుల భవితలో 'గురు'తర బాధ్యత

● ఎమ్మెల్యే పులివర్తి నాని


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు నాని, ఆరణి శ్రీనివాసులు తదితరులు

తిరుచానూరు, సెప్టెంబరు 14: సమాజంలో గురువు పాత్ర చాలా కీలకమని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో శనివారం చంద్రగిరి నియోజకవర్గ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి తిరుపతి, చంద్రగిరి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ తల్లి,తండ్రి తరువాత గురువే మార్గదర్శకులన్నారు. గురువు కులమత బేధాలు లేకుండా నిస్వార్థంగా విద్య బోధిస్తారన్నారు. పిల్లల బంగారు భవిష్యత్తును నిర్ణయించేది గురువులేనన్నారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ సమాజ భవిష్యత్ తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందన్నారు. జేసీ శుభం బన్సల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ గురువు చెప్పే విషయాలను శ్రద్ధగా నేర్చుకుంటే ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. ఉపాధ్యాయులను ఎమ్మెలే నాని ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యం అలరించింది. కార్యక్రమంలో డీఈవో శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న దర్శనం



చంద్రగిరి, సెప్టెంబరు 14: శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం బంగారు తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లను కల్యాణ మండపంలో వేంచేపు చేసి కల్యాణోత్సవం నిర్వహించారు. వారోత్సావాలు సందర్భంగా సాయంత్రం ఆలయ ఆవరణలో స్వామి అమ్మవార్ల ఉత్సవర్లకు ఊంజల్ సేవను కన్నులపండువగా నిర్వహించారు. ఉత్సవర్లను విశేషంగా అలంకరించి బంగారు తిరుచ్చి వాహనంపై మాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్స్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్స్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజిరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారథి, జమేదర్ చిరంజీవి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

గజవాహనంపై పద్మావతిదేవి అభయం



తిరుచానూరు, సెప్టెంబరు 14: తిరుచానూరులోని పద్మావతి అమ్మవారికి శనివారం రాత్రి వేడుకగా గజవాహన సేవ జరిగింది. అమ్మవారి జన్మనక్షత్రం ఉత్తరాషాడ పురస్కరించుకుని సుప్రభాత సేవతో అమ్మవారి మేల్కొపి అర్చకులు మూలమూర్తికి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. సర్వ అలంకార శోభితురాలైన పద్మావతి దేవి శనివారం రాత్రి ప్రీతిపాత్రమైన గజరాజుపై కొలువుదీరి మాడవీధుల్లో భక్తలను కటాక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, ఏవీఎస్వో సతీష్‌కుమార్, అర్చకులు మణికంఠస్వామి, బాబుస్వామి, సూపరింటెండెంట్లు చంద్రశేఖర్, శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు గణేష్, సుబాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కూటమి సారథ్యంలో కోలుకుంటున్న విద్యారంగం


అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న ఆర్ఎస్‌యూ ప్రతినిధులు

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 14: విద్యారంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి అన్నారు. ఆర్ఎస్‌యూ ప్రథమ జాతీయ మహాసభ సందర్భంగా శనివారం ఆ సంఘం ప్రతినిధులు అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలవేశారు. అనంతరం ర్యాలీగా ఎస్వీ యూనివర్సిటీకి చేరుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులు రవిశంకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని గత ప్రభుత్వం చిన్నాభిన్నం చేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రం కోలుకుంటోందన్నారు. ప్రస్తుతం సీబీఎస్ఈ సిలబస్ రాష్ట్రంలో ప్రతి పాఠశాలలో అమలయ్యేలా అన్ని రకాల వసతులు, అధ్యాపకులను ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అమలుకు కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అధ్యక్షులు భీమరాజు, కర్ణాటక ఇంచార్జ్ సురేష్, ఆకు మూల శ్రీధర్, ప్రశాంత్, కృష్ణారెడ్డి, నవీన్‌కుమార్, చిరంజీవి, హరి, విజయ, హారతి, మహాలక్ష్మి, రోజా, ఆఫ్రోన్, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు. అనంతరం పద్మావతినగర్‌లోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న తెలుగుయుత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనందగౌడ్‌ను ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి పరామర్శించారు.

ఉద్యోగ భద్రతకు స్టాఫ్‌నర్సుల ఆందోళన



తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 14: ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్టు కింద పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని రుయా, ప్రసూతి ఆస్పత్రుల్లోని స్టాఫ్‌నర్సులు డిమాండ్ చేశారు. రుయాస్పత్రి ఆవరణలో శనివారం వారు కళ్లకు గంతలు కట్టుకొని వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. స్టాఫ్‌నర్సు విధుల్లో రాత్రి పగలు డాక్టర్లకు ధీటుగా రోగులకు నిత్యం అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాల్సి ఉంటుందన్నారు. దాదాపు 20 ఏళ్లుగా కాంట్రాక్టు కిందనే పనిచేస్తున్నా ఏ ప్రభుత్వం తమను రెగ్యులర్ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా తమను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం స్టాఫ్ నర్సులు కళ్లకు గంతలు కట్టుకొని స్టాఫ్‌నర్సుల పోస్టులు స్టాఫ్‌నర్సులకే కేటాయించాలని, 115 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వివేకానంద సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు.

ఐటీ రంగంలో స్టాటిస్టిక్స్‌కు డిమాండు


విభాగాధిపతి శివపార్వతి

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 14: ఐటీరంగంలో స్టాటిస్టిక్స్‌కు డిమాండు పెరుగుతోందని, అందుకు అనుగుణంగా విద్యనభ్యశించాలని స్టాటిస్టిక్స్ విభాగాధిపతి డాక్టర్ ఎం.శివపార్వతి తెలిపారు. శనివారం పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో స్టాటిస్టిక్స్ విభాగం పూర్వ విద్యార్థులతో ఆన్‌లైన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... విద్యార్థులు సమాభివృద్ధి సాధించడానికి స్టాటిస్టిక్స్ విభాగం ద్వారా తాము చేపట్టిన విధానాలు, ప్రణాళికలను వివరించారు. శిక్షణ పొందే వివరాలను కూడా వివరించారు. క్లినికల్ ట్రయల్స్, మెడికల్ రిసెర్చ్, ఇతర విభాగాలలో స్టాటిస్టిక్స్ యొక్క ప్రాముఖ్యతకు అనుగుణంగా విద్యార్థులకు ప్రాజెక్టు, ఇంటర్న్‌షిప్ వంటి అవకాశం కల్పిస్తున్నామన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు కొంతమంది తమ తమ అభిప్రాయాలను తెలియజేశారు. అధ్యాపకులు, 40మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణలో రక్త కణాలదే కీలక పాత్ర


డాక్టర్ ప్రభు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 14: ప్రజల ఆరోగ్య సంరక్షణలో రక్త కణాలు కీలక ప్రాత పోషిస్తాయని, వీటి భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని చెన్నై అపోలో ఆస్పత్రికి చెందిన ప్రముఖ రక్త సంబంధిత వైద్య నిపుణులు డాక్టర్ ప్రభు తెలిపారు. స్థానిక లక్ష్మీపురం సర్కిల్లోని అపోలో ఆస్పత్రిలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ.. శరీరంలో ఎర్ర, తెల్ల రక్త కణాలతోపాటు ప్లాస్మా, ప్లేట్‌లెట్లు ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు. ఇవి శరీరంలోకి ప్రధాన అవయవాలకు ప్రాణ వాయువును తీసుకువెళ్లేందుకు, అంటువ్యాధుల నుంచి రక్షించడంతోపాటు రోగ నిరోధక శక్తి పెంచేందుకు ఉపయోగపడతాయన్నారు. వీటి సంఖ్య తగ్గినప్పుడు రక్తహీనతకు గురై అనేక వ్యాధుల బారిన పడతారన్నారు. మహిళలు తగు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ఈ సమస్యలపై అపోలో ఆస్పత్రిలో అందించే చికిత్సల గురించి ఆయన వివరించారు.

త్వరలో వరద బాధితులకు నిత్యావసరాలు


నిత్యావసరాల వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 14: విజయవాడ వరద బాధితులకు త్వరలో నిత్యావసర సరుకులను అందజేయనున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. శనివారం మధ్యాహ్నం జనశక్తి ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ నాయకులు అలహరి సుధాకర్, తోకల అశోక్‌లు పది కిలోల బరువుగల 120మూటలను ఎమ్మెల్యేకి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పిలుపుమేరకు విరాళాల సేకరణ జరుగుతోందన్నారు. గత వారం రోజులుగా నగరంలో నిత్యావసరాలను జనసేన పార్టీ యువనాయకులు ఆరణి మదన్ నేతృత్వంలో సేకరిస్తున్నట్లు తెలిపారు. సుమారు రూ.50లక్షల విలువచేసే నిత్యావసర సరుకులను ప్రత్యేక కిట్స్‌గా ఏర్పాటుచేసి నేరుగా బాధితులకు అప్పగించనున్నట్లు చెప్పారు. నిరాశ్రయులైన బాధితులకు ప్రతి ఒక్కరూ తోడ్పాటందించాలని ఆయన కోరారు.

చిగురువాడ పంచాయతీలో..
నిధుల దుర్వినియోగంపై విచారణ

తిరుపతి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం చిగురువాడ గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టి, నివేదిక సమర్పించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. చిగురువాడ పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన వార్డుల శివకుమార్‌యాదవ్ డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు ఇచ్చారు. గ్రామ పంచాయతీకి ఏటా ట్యాక్స్‌ల రూపంలో రూ.60-70లక్షలతోపాటు ఇతర అన్నిరకాల నిధులు కలిపి రూ.2-3కోట్ల వరకు వస్తుందని, పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసులుతో సర్పంచ్ ఎం.ప్రదీప్‌కుమార్‌రెడ్డి కలసి రూ.లక్షల్లో అవకతవకలకు పాల్పడారని పేర్కొన్నారు. వైసీపీ కార్యకర్తలను సిబ్బందిగా నియమించి జీతాలు ఇవ్వడం, చెత్తసేకరణ వాహనాన్ని(ట్రాక్టర్) టెండరు లేకుండా పెట్టుకుని నెలకు దాదాపు రూ.50-60వేలు చెల్లించడం, తాగునీటి పైపులు, మోటార్ల మరమ్మతులు, బోరు పైపులు వంటి పనులకు పెద్దమొత్తంలో నిధులు ఖర్చు చేయడం, బ్లీచింగ్ కొనుగోళ్లకు సంబంధించి 2021 నవంబరు 23న రూ.1,00,750, 2022జనవరి 1న రూ.49,500 ఖర్చు చేయడం వంటి అంశాలపై విచారించాలని కోరారు. ఈ విషయమై గత ప్రభుత్వంలో ఉన్నతాధికారులకు విన్నవించినా న్యాయం జరగలేదన్నారు. లోకాయుక్తలోనూ ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. స్పందించిన కమిషనర్ కార్యాలయ అధికారులు దీనిపై సమగ్ర విచారణ జరిపి, 15 రోజుల్లో నివేదిక అందించాలని ఉత్తర్వులు జారీ చేసి ఉండడం గమనార్హం.

బంగారమ్మ మృతికి నాని సంతాపం

తిరుపతిరూరల్,సెప్టెంబరు14: తిరుపతిరూరల్ మండలం సి.గొల్లపల్లెకు చెందిన టీడీపీనేత మనోహర్‌రెడ్డి తల్లి బంగారమ్మ మృతికి శనివారం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తినాని నివాళి సంతాపం ప్రకటించారు.ఆమె పార్థివదేహానికి పుష్పాంజలితో నివాళి అర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఉప సర్పంచ్ చొక్కారెడ్డిగారి చెంగారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలగుంటలో పవిత్రోత్సవాలు ప్రారంభం

తిరుపతిరూరల్, సెప్టెంబరు 14: తుమ్మలగుంటలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 8నుంచి10గంటలవరకు యాగశాలలో పుణ్యాహవచనం, పంచగవ్యారాధన, రక్షాబంధనం నిర్వహించారు. పవిత్రమాలలను ఊరేగింపుగా ఆలయంలోకి తీసుకొచ్చారు. ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం చేశారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, చందనంతో అభిషేకించారు. సాయంత్రం స్వామివారు ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సోదరుడు రఘునాథరెడ్డి, మంజుల దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా వినాయక కల్యాణం



భాకరాపేట, సెప్టెంబరు 14: చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేటలో శనివారం వినాయక స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కాణిపాక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భాకరాపేట గంగమ్మ గుడివీధిలో శ్రీరామ యూత్ కమిటీ ఆధ్వర్యంలో పచ్చని పందిరిలో వేదమంత్రాలతో వినాయక స్వామి కల్యాణ వేడుక నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. మొక్కులు తీర్చుకున్నారు. వీరికి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

108లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

భాకరాపేట, సెప్టెంబరు 14: చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల్లో 108 వాహనాల్లో పనిచేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏఈఎంఎస్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లకు బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం లైఫ్ సైన్స్, బీఫార్మసీ, పైలెట్ పోస్టుకు 10వ తరగతి పాసై హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 7032382246 నంబరులో సంప్రదించాలని కోరారు.

లోక్ అదాలత్‌లో 156 కేసుల పరిష్కారం



పాకాల, సెప్టెంబరు 14: పాకాల కోర్టులో శనివారం జూనియర్ సివిల్ జడ్జి షేక్ బాబాజాన్ అధ్యక్షతన లోక్ అదాలత్ నిర్వహించారు. 156 క్రిమినల్, సివిల్, పెట్టీకేసులను పరిష్కరించారు. రూ.6,88,000లకు సంబంధించిన వివాదాలు పరిష్కారమయ్యాయి. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యుడు గౌరీశంకర రాజు, సీఏ మద్దయ్యాచారి, స్థానిక న్యాయవాదులు,కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణులకు మెరుగైన వైద్యం : కలెక్టర్


కలెక్టర్‌ను సన్మానించి జ్ఞాపికను అందజేస్తున్న వైద్య విద్యార్థులు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 14: వైద్య విద్యలో అడుగు పెట్టిన ప్రతీ విద్యార్థి గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. స్థానిక ఎస్వీ వైద్య కళాశాల ఆవరణలోని భువన విజయం ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన కళాశాల డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వారికి వైద్యం అందించడం వలన వైద్యరంగంలో చక్కటి ప్రావీణ్యత సాధిస్తారన్నారు. తాను కూడా వైద్య వృత్తిలో రాణించాలనే మొదట అడుగు పెట్టినా తరువాత ఐఏఎస్‌గా బాధ్యతలు చేపట్టాల్సి వచ్చిందన్నారు. అనంతరం వైద్య విద్య చదివే సమయంలో ఆయన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. వైద్య విద్యార్థులు పరిశోధనలపై కూడా దృష్టి సారించాలని చెప్పారు. అనంతరం వైద్య విద్యార్థులు ఆయన్ను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, రుయా, ప్రసూతి సూపరింటెండెంట్‌లు రవిప్రభు, పార్థసారథిరెడ్డి, వైద్యాధికారులు వెంకట్, మాధవిలత పాల్గొన్నారు.

జోరుగా మొదలైన వరి కోతలు

రామచంద్రాపురం, సెప్టెంబరు 14: మండలంలోని సంజీవరాయపురం, బలిజపల్లె, సీకేపల్లె, గంగిరెడ్డిపల్లె గ్రామాల్లో వరికోతలు జోరందుకున్నాయి. ఈ సీజన్‌లో వరికి గిట్టుబాటు ధర లభిస్తుండటంతో పొలాల వద్దే విక్రయాలు జరుగుతున్నాయి. మండలంలో 1,905 ఎకరాల్లో వరి సాగయింది. ఎకరా సాగుకు రూ.20వేల నుంచి రూ.25వేల వరకూ ఖర్చు అయినట్లు రైతులు చెప్పారు. ధాన్యం 25 నుంచి 30 బస్తాల వరకూ దిగుబడి వస్తోంది. 80 కేజీల బస్తా ధర రూ.1,440 పలుకుతోంది. ఎకరాకు రైతుకు రూ.40వేలనుంచి రూ.42వేలు చేతికి అందుతోంది. ఎకరా మీద కనీసం రూ.20వేల మిగులుతోందని కొందరు రైతులు చెప్పారు. రెండేళ్ల క్రితం 80 కేజీల బస్తా ధర రూ.810 నుంచి రూ.880 అమ్మింది. ఆ సమయంలో ఎకరా 30 బస్తాలు దిగుబడి వచ్చినా రూ.21వేలు రైతు చేతికి రావడంతో బాగా నష్టపోయామని పలువురు రైతులు గుర్తు చేసుకున్నారు.

18న అన్న క్యాంటీన్ల ప్రారంభం



మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని నాలుగు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను ఈ నెల 18వ తేదీన ప్రారంభించేందుకు అన్నిఏర్పాట్లు చేయాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. అన్న క్యాంటీన్ల ప్రారంభోత్సవంపై ఇంజనీరింగ్ అధికారులు, అక్షయపాత్ర నిర్వాహకులతో శనివారం కమిషనర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రభుత్వ సూచనల మేరకు అన్ని హంగులతో స్విమ్స్ కూడలి, న్యూ బాలాజీ కాలనీ, ముత్యాలరెడ్డిపల్లి, ఈఎస్ఐ హాస్పిటల్ వద్ద అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇవి మొదటి దశలో ప్రారంభం కాలేదని, ఈ నెల 18న రెండవ దశలో ప్రారంభించాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయని అన్నారు. ప్రజలకు అందించే ఆహారం సరైన సమయంలో ఇవ్వాలని అక్షయపాత్ర నిర్వాహకులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్ఈ మోహన్, డీఈలు విజయ్ కుమార్ రెడ్డి, సంజయ్ కుమార్, మహేష్, రాజు, ఎంహెచ్‌వో డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, మేనేజర్ చిట్టిబాబు, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి, మెప్మా కృష్ణవేణి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయలో విశ్వం విద్యార్థుల విజయకేతనం

మూడోజాబితాతో కలిపి మొత్తం 59మందికి సీట్లు



నవోదయకు ఎంపికైన విద్యార్థులు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 14: జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2024-25 విద్యాసంవత్సరానికి 6, 11 తరగతుల్లో ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశపరీక్ష మూడో జాబితాలో తమ విద్యార్థులు 8మంది సీట్లు సాధించి విజయకేతనం ఎగురవేశారని తిరుపతిలోని విశ్వంస్కూల్ ఛైర్మన్, కోచింగ్ ఫెడరేషన్ఆఫ్ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రెడ్డిచరణ్‌రెడ్డి, కోమల్ కుమార్, గణేష్, మహేష్, యామిని, సంతోష్, చేతన్‌రెడ్డి, హరిచరణ్‌లు సీట్లు పొందారని తెలిపారు. ఈవిద్యాసంవత్సరంలో విడుదలచేసిన మూడు జాబితాల్లో కలిపి మొత్తంగా 59మంది విద్యార్థులు 6, 11 తరగతుల్లో ప్రవేశాలకు సీట్లు సాధించారని తెలిపారు. గత 34 సంవత్సరాలుగా తమవద్ద శిక్షణ పొందిన పలువురు విద్యార్థులు సైనిక్, మిలటరీస్కూల్స్, నవోదయ వంటి జాతీయస్థాయి ప్రవేశపరీక్షల్లో ఎక్కువసంఖ్యలో సీట్లు సాధిస్తుండటం సంతోషంగా ఉందని తెలిపారు. విద్యార్థులను కరస్పాండెంట్ తులసీవిశ్వనాథ్, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ, టీచర్లు అభినందించారు.

రుయా తీరు మారదా?



వృద్ధాప్యంలో ఉన్న తండ్రిని ఆయన కుమారులే భుజాలపై మోస్తూ వైద్య పరీక్షలకు తీసుకెళుతున్న ఈ దృశ్యం శనివారం రుయాస్పత్రిలో కనిపించింది. పేదల ఆస్పత్రిగా పేరుబడ్డ ఈ ఆస్పత్రిలో ఇలాంటి దృశ్యాలు సర్వసాధారణమై పోయాయంటే వైద్య సిబ్బంది సేవలపై అధికారుల పర్యవేక్షణ ఏస్థాయిలో వుందో తెలుస్తుంది.

- తిరుపతి(వైద్యం)

జెన్‌సెస్ పథకానికి మహిళా వర్సిటీ ఎంపిక

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 14: న్యూఢిల్లీకి చెందిన ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ(ఎంఈఐటీవై) జెన్ నెక్స్ట్ సపోర్ట్ ఫర్ ఇన్నోవేటివ్ స్టార్టప్(జెన్‌సెస్) పథకం కింద స్టార్టప్‌లను ఆర్థికంగా ప్రోత్సహించేందుకు దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన ఇంకుబేషన్ సెంటర్లలో పద్మావతి మహిళా వర్సిటీలోని టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేషన్ సెంటర్(టీబీఐ) ఎంపికైంది. ఈ పథకం నుంచి నిధుల కోసం వర్సిటీ టీబీఐ నవంబరులో(ఎంఈఐటీవై)కి ప్రపోజల్స్ పంపింది. ప్రపోజల్స్‌ను పరిశీలించి జెన్‌సెస్ పథకం కింద మహిళా వర్సిటీని ఎంపిక చేస్తున్నట్లు ఎంఈఐటీవై స్టార్టప్‌హబ్ ప్రోగ్రాం సంచాలకులు ఓంకార్ నాథ్ శనివారం వర్సిటీకి లిఖితపూర్వకంగా సమాచారం అందించారు. ఈ పథకం కింద ఐదేళ్ల కాలం పాటు టీబీఐలో పరిశోధనలకు ఆర్థిక సహకారం అందించనుంది. ఇన్‌చార్జి వీసీ వి.ఉమ టీబీఐ సిబ్బందికి అభినందనలు తెలిపారు.

కట్టపుట్టాలమ్మ ఆలయాన్ని పరిరక్షించాలి



ఆలయంలో పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి తదితరులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 14: తిరుపతి సమీపంలోని కరకంబాడి వద్ద ఉన్న కట్టపుట్టాలమ్మ దేవాలయం లోని శిల్పాలను పరిరక్షించాలని ప్రముఖ పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి అన్నారు. శనివారం ఆయన పర్యావరణ ప్రేమికుడు బీవీ రమణతో కలిసి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కట్టపుట్టాలమ్మ ఆలయం ముందున్న శిల్పాలు మధ్యయుగాల నాటివని తెలిపారు. ఆలయ మండపంలో ఉన్న వీరభద్ర, అమ్మవారు, గణేష, ఆత్మార్పణ వీరుడు, ద్వారపాలక శిలలు భూమిలో పూడుకుపోయి ఉన్నాయని, వాటిని వెలికి తీసి పీఠంపై ప్రతిష్ఠించడంతో పాటు వాటికి ఉన్న రంగులను తొలగించాలన్నారు. బ్రిటీష్ కాలం నుంచి కరకంబాడి, మామండూరు, కృష్ణాపురం పాలెగాళ్లు ఈ ప్రాంతాన్ని, యాత్రీకులను రక్షించేవారని బీవీ రమణ తెలిపారు. అప్పట్లో వీరు కట్టపుట్టాలమ్మను ఆరాధించేవారని చెప్పారు. 400 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని, శిల్పాలను పరిరక్షించి భవిష్యత్ తరాలకు అందించాలని ఆలయ అధికారులకు, గ్రామస్తులకు వీరు విజ్ఞప్తి చేశారు. ప్రముఖ శిల్పి పెంచల ప్రసాద్ కూడా ఆలయాన్ని సందర్శించారు.

సీ 7 స్పా కేంద్రం సీజ్

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 14: తిరుపతిలోని స్పా కేంద్రాల్లో శనివారం తనిఖీలు చేపట్టినట్లు డీఎస్పీ వెంకటనారాయణ తెలిపారు. డీబీఆర్ ఆస్పత్రి రోడ్డులోని సీ 7 స్పా కేంద్రంలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు తేలడంతో సీజ్ చేసినట్లు చెప్పారు. స్పా సెంటర్ మేనేజర్ మనీషాతో పాటు ఆర్గనైజర్లు మహి, ఆమె భర్త ఆప్తాబ్‌ను అరెస్టు చేసినట్లు వివరించారు. కాగా పోలీసు తనిఖీల విషయం తెలియడంతో పలు స్పా కేంద్రాలకు యజమానులు తాళాలు వేసుకుని వెళ్లిపోయారు.

బౌద్ధ ధర్మాల నిధి 'నిర్వాణ'



నిర్వాణ నవలను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 14: మానవీయ విలువలకు, బౌద్ధధర్మాలకు అద్దంపట్టేలా నిర్వాణ నవల ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. డాక్టర్ బండి సత్యనారాయణ రచించిన నిర్వాణ నవల ఆవిష్కరణ సభ తిరుపతికి చెందిన వేమన విజ్ఞాన కేంద్రం, దళిత సాహిత్యవికాస వేదిక సంయుక్తంగా నిర్వహించాయి. శనివారం ఉదయం యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షులు పి.అంజయ్య అధ్యక్షతన జరిగిన సభలో ప్రముఖ బౌద్ధరచయిత బొర్రా గోవర్ధన్ మాట్లాడుతూ.. నిర్వాణ అంటే పూర్తిగా ఆరిపోవడమని తెలిపారు. కవి కాలంతో జీవించాలని, క్రాంత దర్శి కావాలని అన్నారు. సమాజంలో సమానత్వం కావాలని చెప్పిన మొదటి వ్యక్తి బుద్ధుడేనని తెలిపారు. అనంతరం పి.అంజయ్య మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యానికి అక్షరం ఎంతో అవసరమని చెప్పారు. సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, ఆకాశవాణి మాజీ సహాయ సంచాలకులు మల్లేశ్వరరావు, విశ్రాంత జిల్లా న్యాయమూర్తి పి.గురప్ప, రోటరీ తల్లిపాల నిధి అధ్యక్షులు టెంకాయల దామోదరం, ప్రముఖ కవి గొడుగుచింత గోవిందయ్య, నడ్డి నారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, వేమన విజ్ఞాన వేదిక కార్యదర్శి మల్లారపు నాగార్జున, చిన్నం కాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి ఇండిపెండెంట్ స్కూల్స్ విరాళం



కలెక్టర్‌కు చెక్కును అందజేస్తున్న ఇండిపెండెంట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 14: వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి తిరుపతి జిల్లా ఇండిపెండెంట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రూ.4 లక్షలను విరాళంగా అందజేశారు. అకార్డ్, వెరిటాస్ సైనిక్‌స్కూల్, సత్యా స్కూల్, కాండోర్ పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు శనివారం ఇందుకు సంబంధించిన చెక్కును కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అందజేశారు.

రచయిత్రి ఉషారాణికి అవార్డు



తిరుపతి అర్బన్, సెప్టెంబరు 14: చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట వాసి రచయిత్రి ధనాసి ఉషారాణిని తిరుపతికి చెందిన కలం యువతేజం ట్రస్ట్ నిర్వాహకులు రాధాకృష్ణ నేషనల్ అవార్డుకు ఎంపిక చేశారు. జీవకోనలోని విశ్వం స్కూల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో విశ్రాంత ఉపకులపతి కంకణాల రత్నయ్య, ప్రముఖ రచయిత, ప్రిన్సిపల్ నారాయణ స్వామి, యువతేజం ట్రస్ట్ ఛైర్మన్ కరీముల్లా ఆమెను ఘనంగా సన్మానించి మెమెంటో, ప్రశంసాపత్రాలను అందజేశారు.

ఎక్సైజ్‌కు నూతన జవసత్వాలు

సీఎం, మంత్రి ఫొటోలకు పాలాభిషేకం



తిరుపతి (నేరవిభాగం), సెప్టెంబరు 14: కూటమి ప్రభుత్వం సెబ్‌ను రద్దు చేసి ఎక్సైజ్ శాఖకు మళ్లీ పూర్వవైభవం తీసుకొస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో శనివారం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఈఎస్ జానకిరాం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి కొల్లు రవీంద్ర చిత్ర పటాలకు పాలాభిషేకం చేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఈఎస్ జానకిరాం మాట్లాడుతూ... ఈ రోజునుంచి అందరూ కలిసి ఎక్సైజ్ శాఖను పటిష్ఠం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సెబ్ నుంచి వచ్చిన అధికారులు, ఉద్యోగులు, ఎక్సైజ్ శాఖ అధికారులు, ఉద్యోగులు పరస్పరం అభినందనలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఈఎస్ శ్రీనివాసరావు, సీఐలు సుబ్బారెడ్డి, శ్రీహరి, భీమలింగం, భాగ్యలక్ష్మి, అఖిల మహేంద్ర, సతీష్, నవీన్‌బాబు, అశోక్, జయశంకర్, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

22న ఘంటసాల బయోపిక్ బెనిఫిట్ షో

తిరుపతి (విద్య), సెప్టెంబరు 14: ఈనెల 22వ తేదీన తిరుపతిలోని దేవేంద్ర థియేటర్‌లో ఘంటసాల బయోపిక్ బెనిఫిట్ షో నిర్వహించనున్నట్లు తిరుపతి ఫిలిం సొసైటీ సభ్యులు వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... సీహెచ్ రామారావు దర్శకత్వంలో సీహెచ్ ఫణి నిర్మాతగా ఘంటసాల జీవిత చరిత్రను సినిమాగా తీశారని, అయితే ఆర్థిక ఇబ్బందులవల్ల దానిని రిలీజ్ చెయ్యలేకపోయినట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులనుంచి గట్టెక్కి సినిమాను ఘనంగా రిలీజ్ చేసే ప్రయత్నంలో భాగంగా ఈనెల 22న ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటల వరకు స్థానిక దేవేంద్ర థియేటర్‌లో బెనిఫిట్ షో ఉంటుందని వెల్లడించారు. తిరుపతి ఫిలిం సిటీ, తిరుపతి లయన్స్ క్లబ్, రోటరీక్లబ్ సహకారంతో నిర్వహిస్తున్న బెనిఫిట్‌షోను ఘంటసాల అభిమానులు, నగర ప్రజలందరూ ఆదరించి విజయవంతం చేయాలని, దర్శక నిర్మాతలకు సహకారమందించి సినిమా రిలీజ్‌కు పాటుపడాలని ఆయన కోరారు. తిరుపతి ఫిలింసొసైటీ అధ్యక్షులు బుచ్చిబాబు నాయుడు, కోశాధికారి శివప్రసాద రావు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

తిరుపతి (లీగల్), సెప్టెంబరు 14: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 20మందికి జరిమానా విధిస్తూ 4వ అదనపు మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ శనివారం తీర్పు చెప్పారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగించిన తొమ్మిదిమంది చిరువ్యాపారులకు కూడా జరిమానా విధించారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన



జాతర ఏర్పాట్లకు సూచనలిస్తున్న కురుగొండ్ల

వెంకటగిరి, సెప్టెం బరు 14: గ్రామశక్తి పోలేరమ్మ జాతర ఏర్పాట్లను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ శనివారం పరిశీలించారు. అమ్మవారి పుట్టి నిల్లుగా భావించే కురమప్రి వీధిలోని కుమ్మరింట వద్ద ఏర్పాట్లు, జీని గలవారి వీధిలోని అమ్మవారి అత్తవారిల్లుగా భావించే చాకలింటి వద్ద చేయాల్సిన ఏర్పాట్లపై సూచనలిచ్చారు. బయటి ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులను తమ ఇంటి బంధువులుగా ఆదరించడంతో పాటు, అధికారులకు సహకరించి జాతర విజయ వంతానికి కృషి చేయాలని కోరారు. 25,26 తేదీల్లో జాతర సందర్భంగా ఎక్కడైనా అవాంచనీయ సంఘటనలు జరిగితే 8374509962 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. తెలిపారు. ఎమ్మెల్యే వెంట నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, గొల్లగుంట మురళి, జీరం రాజేశ్వరావు, గల్లా శ్రీనివాసులు నాయుడు, కాపా శ్రీనివాసులు నాయుడు, బార్ మధు నాయుడు, అవ్వారు సత్యనారాయణ, తాండవ చంద్రారెడ్డి, రామచంద్రయ్య, నరసింహులు, హేమంత్ చౌదరి, నానీ, చంటి తదితరులు ఉన్నారు.

మిద్దెపై నుంచి పడి యువకుడి మృతి

తడ, సెప్టెంబరు 14: మద్యం మత్తులో హల్‌చల్ చేసిన యువకుడు మిద్దెపైకెక్కి, అక్కడ నుంచి కింద పడి మృతి చెందిన ఘటన మండలంలోని పులివేంద్ర వద్ద శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. బిహార్ రాష్ట్రానికి చెందిన బాబులాల్ ముర్ము(32) రెండు రోజుల క్రితం మాంబట్టు సెజ్‌లోని వీకేసీ పరిశ్రమలో పనిచేసేందుకు వచ్చాడు. శుక్రవారం విధులు ముగించుకుని పులివేంద్ర వద్ద ఉన్న తన బంధువు ఉంటున్న గదికి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో పూటుగా మద్యం తాగి బయటకు వెళ్లాడు. సమీపంలోని సుస్తి టౌన్‌షిప్ వద్దకు చేరుకొని హల్‌చల్ చేశాడు. సెక్యూరిటీపై రాళ్లు విసరడం, ఇళ్లలోకి దూరి గొడవ చేయడం ప్రారంభించాడు. స్థానికులు అతనిని పట్టుకు నేందుకు ప్రయత్నం చేయగా, ఓ ఇంటి మిద్దెపైకి వెళ్లి అక్కడ నుంచి రాళ్లు విసురుతూ అక్కడ నుంచి కిందకు దూకేశాడు. ఈక్రమంలో ప్రహరీపై పడ డంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘ టనా స్థలానికి చేరుకుని బాబులాల్ ముర్ము మృతదేహాన్ని స్వాధీనం చేసు కొని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడింగ్ నైపుణ్యాల పెంపు కోసమే క్రాఫ్టర్స్ క్లబ్



కోడ్ క్రాఫ్టర్స్ క్లబ్‌ను ప్రారంభిస్తున్న కళాశాల సిబ్బంది

గూడూరు, సెప్టెంబరు 14: విద్యార్థుల్లో కోడింగ్ నైపుణ్యాలను పెంపొం దించి, ఉద్యోగ అవకాశాలను మెరుగుపరిచేందుకే కోడ్ క్రాఫ్టర్స్ క్లబ్‌ను ప్రారంభిస్తున్నట్లు ఆదిశంకర కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వేణుమాధవ్ తెలిపారు. శనివారం కళాశాలలో వైజాగ్‌కు చెందిన డెమీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సహకారంతో కోడ్‌క్రాఫ్టర్స్ క్లబ్‌ను ప్రారంభించారు. కోడింగ్ విభాగంలో విద్యార్థులకు మెరుగైన పరిజ్ఞానాన్ని పెంపొందించి ఉపాధి కల్పించేందుకు ఈ క్లబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో రాజయ్య, ఇమ్మానియేల్, పద్మావతి, సురేంద్రరెడ్డి, రామయ్య పాల్గొన్నారు.

కట్టపుట్టాలమ్మ ఆలయాన్ని పరిరక్షించాలి



ఆలయంలో పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి తదితరులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 14: తిరుపతి సమీపంలోని కరకంబాడి వద్ద ఉన్న కట్టపుట్టాలమ్మ దేవాలయంలోని శిల్పాలను పరిరక్షించాలని ప్రముఖ పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి అన్నారు. శనివారం ఆయన పర్యావరణ ప్రేమికుడు బీవీ రమణతో కలిసి ఆలయాన్ని సందర్శిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కట్టపుట్టాలమ్మ ఆలయం ముందున్న శిల్పాలు మధ్యయుగాల నాటివని తెలిపారు. ఆలయ మండ పంలో ఉన్న వీరభద్ర, అమ్మవారు, గణేష, ఆత్మార్పణ వీరుడు, ద్వారపాలక శిలలు భూమిలో పూడుకుపోయి ఉన్నాయని, వాటిని వెలికి తీసి పీఠంపై ప్రతిష్ఠించడంతో పాటు వాటికి ఉన్న రంగులను తొలగించాలన్నారు. బ్రిటీష్ కాలంలో కరకంబాడి ఎంతో ప్రాముఖ్యత కలిగిన ప్రాంతమని, కరకంబాడి, మామండూరు, కృష్ణాపురం పాలెగాళ్లు ఈ ప్రాంతాన్ని, యాత్రికులను రక్షించే వారని బీవీ రమణ తెలిపారు. అప్పట్లో ఈ పాలెగాళ్లు కట్టపుట్టాలమ్మను ఆరా ధించేవారని చెప్పారు. 400 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని, శిల్పాలను పరిరక్షించి భవిష్యత్ తరాలకు అందించాలని ఆలయ అధికారు లకు, గ్రామస్తులకు వీరు విజ్ఞప్తి చేశారు. ప్రముఖ శిల్పి పెంచల ప్రసాద్ కూడా ఆలయాన్ని సందర్శించారు.

18న అన్న క్యాంటీన్ల ప్రారంభం



తిరుపతి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని నాలుగు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను ఈ నెల 18వ తేదీన ప్రారంభించేందుకు అన్నిఏర్పాట్లు చేయాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. అన్న క్యాంటీన్ల ప్రారంభోత్సవంపై ఇంజనీరింగ్ అధికారులు, అక్షయపాత్ర నిర్వాహకులతో శనివారం కమిషనర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రభుత్వ సూచనల మేరకు అన్ని హంగులతో స్విమ్స్ కూడలి, న్యూ బాలాజీ కాలనీ, ముత్యాలరెడ్డిపల్లి, ఈఎస్ఐ హాస్పిటల్ వద్ద అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇవి మొదటి దశలో ప్రారంభం కాలేదని, ఈ నెల 18న రెండవ దశలో ప్రారంభించాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయని అన్నారు. ప్రజలకు అందించే ఆహారం సరైన సమయంలో ఇవ్వాలని అక్షయపాత్ర నిర్వాహకులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్ఈ మోహన్, డీఈలు విజయ్ కుమార్ రెడ్డి, సంజయ్ కుమార్, మహేష్, రాజు, ఎంహెచ్‌వో డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, మేనేజర్ చిట్టిబాబు, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి, మెప్మా కృష్ణవేణి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.78 కోట్లు

తిరుమల, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.78 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ఉదయం ప్రకటించింది. శుక్రవారం 60,694 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 27,350 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

నగరిలో వైసీపీ పట్టు కోల్పోతోందా?

నగరి, సెప్టెంబరు 14: నగరి నియోజకవర్గంలో రోజురోజుకూ వైసీపీ పట్టు కోల్పోతున్నట్లు కనిపిస్తోంది.పార్టీ సీనియర్ నేతలు,నగరి మున్సిపల్ మాజీ ఛైర్మన్లు కేజే కుమార్, కేజే శాంతిలను వైసీపీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు చిత్తూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు భరత్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో కేజే కుమార్ కుటుంబం తనకు వ్యతిరేకంగా పనిచేసిందని మాజీ మంత్రి రోజా చేసిన ఫిర్యాదుతో పార్టీ అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇప్పటికే బలమైన నేతలుగా పేర్కొనే విజయపురం మండల నాయకుడు లక్ష్మీపతిరాజు,నింద్ర మండలంలో శ్రీశైలం ఆలయ ట్రస్ట్‌బోర్డు మాజీ ఛైర్మన్ చక్రపాణిరెడ్డి, ఆయన సోదరుడు భాస్కర్ రెడ్డి, పుత్తూరులో మొదలియార్ వర్గానికిచెందిన ఏలుమలై (అమ్ములు), వడమాలపేట మండలానికి చెందిన జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి ఎన్నికల ముందే టీడీపీలో చేరిపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మరికొందరు వైసీపీ నాయకులు టీడీపీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారని సమాచారం.ఈ పరిణామాల పట్ల వైసీపీ శ్రేణుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అధికారం కూడా లేని సమయంలో ఇలా బలమైన నేతలను సస్పెండ్ చేసుకుంటూ పోతే పార్టీ మరింత బలహీనపడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

చిల్లకూరు, సెప్టెంబరు 14: మండలంలోని కోట క్రాస్‌రోడ్డు సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు... మండలంలోని రెట్టపల్లి గ్రామానికి చెందిన మస్తాన్(28) నాయుడుపేట వైపు బైక్‌పై వెళుతుండగా టిప్పరు అకస్మాత్తుగా ఆగడంతో వెనుక నుంచి ఢీకొన్నాడు. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు

కోట, సెప్టెంబరు 14: మండల పరిధిలోని చంద్రశేఖరపురం సున్నంబట్టి వద్ద శనివారం ట్రాక్టర్‌ను కారు ఢీకొంది. వాకాడు మండలం వైట్‌కుప్పానికి చెందిన ఒక కుటుంబం కారులో గూడూరు నుంచి కోట వైపు వెళ్తూ చంద్రశేఖరపురం సున్నంబట్టి వద్ద ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొంది. దీంతో ట్రాక్టర్ పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. కారు ముందుభాగం నుజ్జునుజ్జు అయ్యింది. అందులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి.

అదుపుతప్పి కారు బోల్తా

కోట, సెప్టెంబరు 14: మండల పరిధిలోని విద్యానగర్ కొత్తపాళెం రోడ్డు సమీపంలో శనివారం ఓ కారు అదుపుతప్పి కాలువలో పడిపోయింది. విద్యానగర్ నుంచి నెల్లూరుపల్లి కొత్తపాళెంకు వేగంగా వెళ్తున్న కారు కొత్తపాళెం రోడ్డు మలుపు వద్ద అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు.

గ్రావెల్ టిప్పర్ల అడ్డగింత

చిల్లకూరు, సెప్టెంబరు 14: సాగరమాల రోడ్డు నిర్మాణ పనులకు గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్లను శనివారం మండలంలోని పారిచెర్లవారిపాళెం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిప్పర్లు అధిక లోడ్డుతో వెళుతుండడంతో రోడ్డు దెబ్బతింటోందన్నారు. అంతేకాకుండా దుమ్ము, దూళి ఇళ్లలోకి చేరుతోందని, దీంతో రోగాల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. మేఘా సంస్థ ప్రతినిధి మాట్లాడుతూ వారం రోజుల్లో రోడ్డు నిర్మాణం చేపడుతామని, రోజుకు నాలుగు ట్యాంకర్ల నీటిని రోడ్డుపై చల్లి దుమ్ము లేవకుండా చూస్తామని చెప్పడంతో గ్రామస్తులు లారీలను వదలిపెట్టారు.

నాయుడుపేట రూట్ మళ్లింపు

వెంకటగిరిటౌన్, సెప్టెంబరు 14: వెంకటగిరి - నాయుడుపేట రైల్వే ట్రాక్ మరమ్మతుల కారణంగా వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు సీనియర్ సెక్షన్ అధికారి స్వామినాధన్ శనివారం తెలిపారు. చిన్న వాహనాలు పెట్లూరు మార్గంలోని అండర్ బ్రిడ్జి ద్వారా, లారీలు, బస్సులు నిడిగల్లు, ఊట్లపల్లి మీదుగా నాయుడుపేట మార్గానికి చేరుకోవచ్చుని చెప్పారు. సోమ, మంగళ, బుధవారం రోజుల్లో ఈ మార్పులు ఉంటాయన్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలిక

సూళ్లూరుపేట, సెప్టెంబరు 14: సూళ్లూరుపేటలో అదృశ్యమైన బాలిక అఫ్రిన్ క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు చేరింది. శుక్రవారం ఉదయం 5 గంటలకు ఇంటి నుంచి ట్యూషన్‌కు వెళ్లిన బాలిక అదృశ్యం అయిన విషయం తెలిసిందే. తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించడంతో సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మనాయుడు వెంటనే అప్రమత్తమై పాఠశాల వద్ద సీసీ ఫుటేజ్‌లు సేకరించి దర్యాప్తు చేపట్టారు. నాలుగు బృందాలుగా ఏర్పడి పోలీసులు చెన్నైకి వెళ్లి బాలిక ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇంట్లో మందలించడంతో బాలిక మనస్థాపం చెంది రైల్వే స్టేషన్ వెళ్లి రైలు ఎక్కి చెన్నై సెంట్రల్‌కు చేరింది. అక్కడ నుంచి ఆటో ఎక్కి బీచ్‌కు వెళ్లాలని చెప్పడంతో డ్రైవర్ అనుమానంతో బాలికను విచారించి అక్కడి పోలీసులకు అప్పగించాడు. శుక్రవారం అర్ధరాత్రి చెన్నై పోలీసులు సూళ్లూరుపేట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు వెళ్లి బాలికను శనివారం తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

టీడీపీ నేతల కార్ల ధ్వంసం

గూడూరు, సెప్టెంబరు 14: స్థానిక కర్ణాలవీధి సమీపంలో శనివారం గుర్తుతెలియని వ్యక్తులు టీడీపీ నాయకుల కార్లను ధ్వంసం చేశారు. కర్ణాలవీధి సమీపంలో నివాసముంటున్న టీడీపీ నేతలు హిమసాయి, ప్రణీత్ తమ వాహనాలను ఇళ్ల ముందుకు పార్కింగ్ చేశారు. శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఈ రెండు కార్ల అద్దాలను రాళ్లతో కొట్టి ధ్వంసం చేశారు. హిమసాయి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

17న తిరుమలలో అనంత పద్మనాభ వ్రతం

తిరుమల, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈనెల 17న అనంత పద్మనాభ వ్రతాన్ని టీటీడీ ఘనంగా నిర్వహించనుంది. ఈసందర్భంగా ఉదయం 6 గంటలకు శ్రీవారి సుదర్శన చక్రత్తాళ్వారును ఆలయం నుంచి ఊరేగింపుగా వరాహస్వామి ఆలయం పక్కన ఉన్న పుష్కరిణి చెంతకు అర్చకులు ఆగమోక్తంగా తీసుకువెళ్లి పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారు. శ్రీవారి సుదర్శన చక్రత్తాళ్వార్లకు పుష్కరిణిలో అభిషేకాదులు నిర్వహించి తిరిగి ఆలయానికి వేంచేపు చేస్తారు. అనంతుడు అంటే ఆదిశేషుడు. ఆదిశేషుడిపై అనంతపద్మనాభస్వామి అవతారంలో ఉన్న మహావిష్ణువును ప్రార్థిస్తూ గృహస్థులు సౌభాగ్యం కోసం ఈవ్రతాన్ని ఆచరిస్తారు. మహావిష్ణువు అనంతకోటి రూపాల్లో వేంకటేశ్వరస్వామి తరహాలోనే శయనమూర్తిగా అనంత పద్మనాభస్వామికి అంతే వైశిష్ట్యం ఉంది. ఏటా ఈపర్వదినాన దేశవ్యాప్తంగా 108 వైష్ణవ దివ్యక్షేత్రాల్లో అనంతపద్మనాభ వ్రతం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

కొత్త జడ్పీ సీఈవో వచ్చాకే బదిలీలు

● పెండింగ్‌లో ఎంపీడీవోల లిస్ట్

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 14: జిల్లాలో వివిధ శాఖల్లో బదిలీల ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. జడ్పీలో ఉద్యోగులు తమకు అనుకూలమైన ప్రాంతాల కోసం ఎంపీ, ఎమ్మెల్యేల లేఖలు సమర్పించారు. గత నెల 31వ తేదిన బదిలీల ప్రక్రియ పూర్తి చేసి సెప్టెంబరు 1వ తేదికి వారు బదిలీ అయిన చోట్లలో చేరాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే పింఛన్ల పంపిణీకి ఇబ్బందులు ఉండకూడదని ప్రభుత్వం సెప్టెంబరు 15 వరకు బదిలీల గడువును పొడిగించింది. తిరిగి విజయవాడ వరదలు కారణంగా ఆ గడువును సెప్టెంబరు 22 వరకు పొడిగించింది. ఇంతలో జడ్పీ సీఈవో బదిలీ కావడంతో బదిలీ ప్రక్రియ నిలిచిపోయింది. కొత్త సీఈవో వచ్చాకే బదిలీల ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

సమర్థులైన ఎంపీడీవోలకోసం ఎమ్మెల్యేల వెతుకులాట

తమ నియోజకవర్గంలో అభివృద్ధి పనులను చక్కబెట్టేందుకు సమర్థులైన ఎంపీడీవోల కోసం ఎమ్మెల్యేలు వెతుకులాట మొదలు పెట్టారు.ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 65 మండలాలుంటే 48 మండలాలకే రెగ్యులర్ ఎంపీడీవోలున్నారు. మిగిలిన 17 మండలాలకు ఈవోఆర్డీలు, ఏవోలు ఇంచార్జ్ ఎంపీడీవోలుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 48మంది రెగ్యులర్ ఎంపీడీవోల్లో ఒక్కరు మాత్రమే ఒకే మండలంలో ఐదేళ్ల సర్వీసును పూర్తి చేసుకున్నారు.48మందిలో సొంత జిల్లాలకు బదిలీ కావాలని 13 మంది ఎంపీడీవోలు దరఖాస్తు పెట్టుకుంటే వాటిని పీఆర్ కమిషనర్ ఆమోదించారు. దీంతో 35మంది ఎంపీడీవోలు మాత్రమే జిల్లాలో మిగిలారు. దీంతో కొన్ని మండలాలకు తిరిగి ఈవోఆర్డీ, ఏవోలను ఇన్‌చార్జ్‌లుగా నియమించనున్నారు. ఈ కారణంగా ఎంపీడీవోల కొరత ఏర్పడడంతో పాటు బదిలీలు కూడా ఆలస్యమవుతున్నాయి.

కుప్పంలో ఒక్కరే విధుల్లోకి

కుప్పం సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గం కావడంతో కలెక్టర్ దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో పనిచేసేందుకు సమర్థవంతులైన ఎంపీడీవోలను ఏరికోరి వేశారు. ఇందు లో కుప్పం మండలానికి బీఎన్ కండ్రిగ ఎంపీడీవో సాయి లహరిని నియమించారు.శాంతిపురానికి వెదురుకుప్పం ఎంపీడీవోగా పనిచేసిన ప్రేమ్‌రాజ్‌కుమార్‌ను నియమించారు. రామకుప్పం మండలానికి ఏర్పేడు ఎంపీడీవో గిడ్డయ్యను, గుడుపల్లి ఎంపీడీవోగా తాజ్‌మజూరూర్‌ను నియమించారు. ఈయన ఎన్నికల బదిలీల్లో బాగంగా వేరే జిల్లాకు బదిలీ అయ్యారు. తిరిగి ఈయన్నే గుడుపల్లి ఎంపీడీవోగా కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే కుప్పం మండలం ఎంపీడీవో సాయి లహరి తప్ప మరెవరూ విధుల్లో చేరలేదు. వివిధ కారణాలు చూపించి తమకు వేరే స్థానాలు కావాలని కలెక్టర్ వద్ద మొరపెట్టుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

జడ్పీ సీఈవో పోస్టుకు తీవ్ర పోటీ

జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పోస్టుకు తీవ్ర పోటీ నెలకొంది. ఆ సీటుకోసం టీడీపీ ముఖ్యనాయకుల ద్వారా ఎవరికి వారు తమ వంతు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. నిన్నటి వరకు రవికుమార్ నాయుడు, ఆదిశేషారెడ్డి పేర్లు విన్పిస్తుండగా తాజాగా వెంకటరత్నం పేరు తెరపైకి వచ్చింది. తిరుపతి జిల్లా డ్వామా ఏపీడీగా పనిచేస్తున్న ఎం. రవికుమార్ నాయుడికి గతంలో జడ్పీసీఈవోగా పనిచేసిన అనుభవం ఉంది. ఆయనకే ఈ పోస్టు ఖరారవుతుందని ప్రచారం జరిగింది.ప్రస్తుత జడ్పీ డిప్యూటీ సీఈవో ఆదిశేషారెడ్డి కూడా సీఈవో పోస్టుపై కన్నేశారు. తనకు తెలిసిన టీడీపీ వర్గాల ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఆయనకు మద్దతు ఇచ్చే వారి సంఖ్య తక్కువే.గతంలో ఇక్కడ జడ్పీ ఏవోగా పనిచేసిన వెంకటరత్నం పేరు రెండ్రోజులుగా బలంగా వినిపిస్తోంది. ప్రస్తుతం ఆయన అనంతపురం జిల్లా తాడిపత్రి డ్వామా ఏపీడీగా విధులు నిర్వహిస్తున్నారు.కలెక్టర్‌గా హరినారాయణన్ ఉన్నప్పుడు హౌసింగ్ శాఖలో పురోగతి లేదంటూ వెంకటరత్నంతో పాటు చాలామంది ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులు జారీచేస్తూ జీతాలను నిలుపదల చేయాలంటూ ఆదేశాలు వచ్చాయి. దాంతో వెంకటరత్నం దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు.తర్వాత పదోన్నతిపై తాడిపత్రి వెళ్ళారు.ఆయనకు జనసేన పెద్దల ఆశీస్సులు మెండుగా ఉన్నట్లు సమాచారం. ఇటీవల మాతృశాఖ రెవిన్యూకు బదిలీ అయిన జడ్పీ సీఈవో గ్లోరియా 18న రిలీవ్ కానున్నారు.ఆమె స్థానంలో ఇన్‌చార్జి సీఈవోగా డిప్యూటీ సీఈవో ఆదిశేషారెడ్డి బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.బదిలీలకు ఈనెల 22వ తేదివరకు ప్రభుత్వం అనుమతిచ్చింది.

డ్వామా పీడీగా గంగాభవాని?

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 14 : డ్వామా ఏపీడీగా పనిచేస్తున్న గంగాభవాని పీడీగా ప్రమోట్ కానున్నారు.మొన్నటిదాకా పీడీగా వ్యవహరించిన రాజశేఖర్‌ను ప్రభుత్వం మాతృశాఖ రెవిన్యూకు బదిలీ చేసింది. ఆయన స్థానంలో రెండేళ్ళ క్రితం అప్పటి పీడీ చంద్రశేఖర్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో పీడీగా గంగాభవానీ చేరి రెండేళ్ళు పనిచేశారు. ఎన్నికల సమయంలో ఆమె స్థానంలో ప్రభుత్వం రాజశేఖర్‌ను నియమించింది. ఇదిలా వుండగా డీఆర్డీఏ పీడీ పోస్టు కోసం ముగ్గురు పోటీపడుతున్నారు. డీఎంకే తులసి ప్రస్తుతం డీఆర్డీఏ పీడీగా ఉండగా, వైసీపీ మద్ధతుదారురాలు అనే ముద్ర పడడంతో పాటు చాలాకాలంగా పనిచేస్తుండడంతో ఆమెకు స్థానచలనం అనివార్యమైంది.

షార్ కాలనీలో చాగంటి ప్రవచనాలు



సూళ్లూరుపేట, సెప్టెంబరు 14: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సూళ్లూరుపేటలోని షార్ ఉద్యోగుల కాలనీ పులికాట్ నగర్‌లో శనివారం చాగంటి ప్రవచనాలు నిర్వహించారు. వ్యక్తి గుణ వైభవం అనే అంశంపై బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు ప్రవచిస్తూ మంచి గుణం ఉన్న వ్యక్తి భగవంతుడితో సమాన మని, సాయం చేసే గుణం ఉన్న వ్యక్తులను ఎప్పటిక మరవరాదన్నారు. షార్ ఉద్యోగులే కాకుండా బయట ప్రాంతాల నుంచి కూడా ప్రజలు విచ్చేసి చాగంటి ప్రవచనాలను ఆసక్తిగా విన్నారు. ఆదివారం కూడా చాగంటి ప్రవచనాలు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

సూళ్లూరుపేట, సెప్టెంబరు 14: ఏపీఆర్‌డీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పేద మహిళకు ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షల చెక్కును ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతుల మీదుగా అందజేశారు. ఓజిలి మండలం మాచవరం గ్రామానికి చెందిన ఎన్.మునెమ్మ ఇల్లు గత ఏడాది వరదలకు పూర్తిగా దెబ్బతింది. ఏపీఆర్డీ ఆర్గనైజేషన్ స్పందించి ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు ఆర్థిక సాయం ఎమ్మెల్యే చేతుల మీదుగా శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్డీ ఆర్గనైజేషన్ కో ఆర్డినేటర్ శిల్పాప్రియాంక, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, నాయకులు ఆకుతోట రమేష్, కుదిరి పెంచలయ్య, పర్వతరెడ్డి చంద్రారెడ్డి, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

పెళ్లకూరు సెప్టెంబరు 14: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. శనివారం మండలంలోని ముమ్మారెడ్డిగుంట సమీపంలోని స్వర్ణముఖినది నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు రెవెన్యూ అధికారులకు సమాచారం రావడంతో ఆర్ఐ సంతోషి బాయి, వీఆర్వోలు రమేష్, కల్యాణి ఎస్ఐ నాగరాజుతో కలసి రెండు ట్రాక్టర్లు పట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసనాక సేవలు మరవలేనివి: విజయశ్రీ

సూళ్లూరుపేట, సెప్టెంబరు 14: మాజీ ఎంపీపీ ఇసనాక హర్షవర్ధనరెడ్డి సేవలు మరవలేనివని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. ఇసనాక జయంతి సందర్భంగా శనివారం ఆయన సతీమణి ఇసనాక వాణి, తనయుడు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చారు. ఈ ప్లాంట్‌కు ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం భూమిపూజ చేశారు. ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. అంతకుముందు ఇసనాక చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టి.సుధాకర్ రెడ్డి, ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, గాడి నారాయణ రెడ్డి, మాధవనాయుడు, విజయభాస్కర్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, పార్థసారథి, విజయకుమార్, రాజ సులోచనమ్మ పాల్గొన్నారు.

ప్రసన్న వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

కోట, సెప్టెంబరు 14: మండల పరిధిలోని చిట్టేడు, నెల్లూరుపల్లి కొత్తపాళెం, గోవిందపల్లి, శ్రీలక్ష్మమ్మకాలనీలలో వెలసిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయాల ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి పలు అభిషేకాలు చేసి విశేష అలంకరణలో ఉంచగా, భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

జెన్‌సెస్ పథకానికి మహిళా వర్సిటీ ఎంపిక

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 14: న్యూఢిల్లీకి చెందిన ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ(ఎంఈఐటీవై) జెన్ నెక్స్ట్ సపోర్ట్ ఫర్ ఇన్నోవేటివ్ స్టార్టప్(జెన్‌సెస్) పథకం కింద స్టార్టప్‌లను ఆర్థికంగా ప్రోత్సహించేందుకు దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన ఇంకుబేషన్ సెంటర్లలో పద్మావతి మహిళా వర్సిటీలోని టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేషన్ సెంటర్(టీబీఐ) ఎంపికైంది. ఈ పథకం నుంచి నిధుల కోసం వర్సిటీ టీబీఐ నవంబరులో(ఎంఈఐటీవై)కి ప్రపోజల్స్ పంపింది. ప్రపోజల్స్‌ను పరిశీలించి జెన్‌సెస్ పథకం కింద మహిళా వర్సిటీని ఎంపిక చేస్తున్నట్లు ఎంఈఐటీవై స్టార్టప్‌హబ్ ప్రోగ్రాం సంచాలకులు ఓంకార్‌నాథ్ శనివారం వర్సిటీకి లిఖితపూర్వకంగా సమాచారం అందించారు. ఈ పథకం కింద ఐదేళ్ల కాలం పాటు టీబీఐలో పరిశోధనలకు ఆర్థిక సహకారం అందించనుంది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ ఉమ టీబీఐ సిబ్బందికి అభినందనలు తెలిపారు.

ఎయిర్ కండిషన్, ఫ్రిజ్ రిపేర్,సర్వీసింగ్‌లో శిక్షణ

చంద్రగిరి, సెప్టెంబరు 14: ద్వారకానగర్‌లోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈనెల 19 నుంచి ఎయిర్ కండిషన్, ఫ్రిజ్ రిపేరు, సర్వీసింగ్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల గ్రామీణ ప్రాంతాల్లో 19 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసుండి తెల్ల రేషన్ కార్డు కలిగిన నిరుద్యోగ పురుషులు శిక్షణకు అర్హులన్నారు. కనీసం పదోతరగతి చదివి ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సంస్థ ఫోన్ ద్వారా పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ధ్రువపత్రాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో సంస్థ కార్యాలయానకికి వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్..7989680587, 9494951289, 6301717672 నంబర్లలో సంప్రదించాలన్నారు.

గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల విరాళం రూ.32.49 లక్షలు



సీఎంకు చెక్ అందజేస్తున్న ఎస్జీబీ ఛైర్మన్ ప్రసాద్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 14: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సప్తగిరి గ్రామీణ బ్యాంకు (ఎస్జీబీ) ఉద్యోగులు తమ వేతనం నుంచి సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళమిచ్చారు. రూ.32.49 లక్షల మెగాచెక్‌ను బ్యాంకు ఛైర్మన్ ఏ.ఎస్.ఎన్.ప్రసాద్ విజయవాడలో సీఎం చంద్రబాబును కలిసి అందజేశారు.ఈసందర్భంగా బ్యాంకుఉద్యోగుల ఔదార్యాన్ని సీఎం అభినందించారు.

ఓసీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీధర్‌వర్మ



సమావేశంలో ప్రసంగిస్తున్న శ్రీధర్‌వర్మ

ఐరాల, సెప్టెంబరు 14: ఓసీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా దాట్ల శ్రీధర్‌వర్మ ఎన్నికైనట్లు ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. శనివారం చిత్తూరు బ్యాన్స్ హోటల్‌లో రాష్ట్ర సంఘాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాసులురెడ్డిని, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా డి.పండుదొర, పరిపాలన కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, ఆర్థిక కార్యదర్శిగా వి.సురేష్‌కుమార్, కోఆర్డినేషన్‌గా వి.మురళీకృష్ణ, అనంతరం వివిధ కమిటీలను ఎన్నుకున్నట్లు వివరించారు. శ్రీధర్ వర్మ మాట్లాడుతూ.. అందరి సహకారంతో ఓసీ విద్యుత్ ఉద్యోగుల సమస్యపై పోరాడతానన్నారు. ఈపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్, సీపీడీసీఎల్, ట్రాన్స్‌కో, జెన్‌కో అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి విరాళాల అందజేత

గూడూరు, సెప్టెంబరు 14: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి శనివారం ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు దాతలు విరాళాలు అందజేశారు. పట్టణంలోని మాళవ్యానగర్‌కు చెందిన విశ్రాంత అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ అధికారి రాంప్రసాద్ రూ.25వేలు చెక్కును ఎమ్మెల్యేకు అందజేశారు. బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, ఇశ్రాయిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక గమళ్లపాళెం జెండా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రూ.25వేలు చెక్కు ఎమ్మెల్యేకు అందించారు. ధనుంజయరాజు, చంద్రశేఖర్, కిరణ్, గిరి, కోటి తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: వరద బాధితుల సహాయార్థం రూ.లక్ష విరాళాన్ని అందజేయనున్నట్లు నాయుడుపేట పట్టణ వస్త్ర వ్యాపారుస్థులు తెలిపారు. రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ద్వారా సీఎం సహాయ నిధికి అందజేయనున్నట్లు వ్యాపారులు తెలిపారు.

నాయుడుపేట టౌన్: వరద బాధితుల సహాయార్థం పట్టణంలోని బంగారు వ్యాపారుస్తులు రూ.1.50 లక్షల చెక్కును మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ ఛైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, దర్శి రమేష్, సముద్రాల రమేష్, సురేంద్ర, సోమిశెట్టి శ్రీనివాసులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ఉత్సవం

చిట్టమూరు, సెప్టెంబర్ 14: మల్లాంలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం ఆలయ కమిటీ ఛైర్మన్ కామిరెడ్డి మునిశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ధ్వజస్తంభ ఉత్సవం వైభ వంగా జరిగింది. శైవాగమ శివాచార్య నాదెండ్ల రామేశ్వర గురుకుల్, ఆలయ ప్రధానార్చకులు మూలంరాజు భాను ప్రకాష్‌శర్మ, బెంగుళూరు కృష్ణయ్యశర్మ ప్రత్యేక మంత్రోచ్చారణలతో వళ్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పూజ అనం తరం దేవతలందరికీ ఆహ్వానం పంపించే ధ్వజారోహణ ఉత్సవం చేపట్టారు. తెల్లటి పొడవైన వస్త్రంలో నేమలివాహనాన్ని వేసి తాడుసాయంతో ధ్వజస్తంభం శిఖరానికి చేర్చి దేవతలందరికీ ఆహ్వానం ఆహ్వానం పంపారు. ఇందులో భాగంగా మయూరీ శ్వరుడు ఆహ్వానం అందించి వచ్చిన తదుపరి కొడిముద్దలను భక్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి సోమిశెట్టి సుబ్బారావు, చెవుల రోశయ్య శెట్టి ఉభయదాతలుగా వ్యవహరించారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు సీల్డ్ టెండర్లు

చిల్లకూరు, సెప్టెంబరు 14: మండలంలోని తూర్పు కనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు సీల్డ్ టెండర్లు నిర్వహించినట్లు ఈవో నవీన్‌కుమార్ తెలిపారు. అక్టోబరు నెలలో జరిగే శరన్నవరాత్రి ఉత్సవాల్లో విద్యుత్ అలంకరణ, ప్రింటింగ్స్, యాగ్నిక్ స్వాములు, ఫ్లెక్సీ ప్రింటింగ్, క్లాత్ పందిళ్ల తదితర పనులకు సీల్డ్ టెండర్లు ఆహ్వానించడం జరిగిందన్నారు.

ఆగమోక్తంగా శనీశ్వరుడికి తైలాభిషేకం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 14: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వర స్వామికి శనివారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. శనీశ్వరస్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి మొదట గణపతి పూజ, కలశపూజ చేశారు. అనంతరం స్వామివారికి నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామి వారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

బంగారమ్మ కాలనీ అభివృద్ధి సేవా సంఘం ఏర్పాటు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 14: పట్టణంలోని బంగారమ్మ కాలనీ అభివృద్ధి కోసం బంగారమ్మ కాలనీ అభివృద్ధి సేవాసంఘం ఏర్పాటు చేసినట్లు అధ్యక్షులు నూతలపాటి వనమాలి నాయుడు తెలిపారు. శనివారం బంగారమ్మ ఆలయంలో జరిగిన కార్యక్రమంలో కాలనీ వాసుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా మనోహర్, ప్రధాన కార్య దర్శిగా శ్రీనివాసులు, కోశాధికారిగా మాధవయ్య, కార్యనిర్వాహక సభ్యులుగా భాస్కర్‌రెడ్డి, రమణారెడ్డి, గోవిందస్వామిరెడ్డి, సోమశేఖర్‌నాయుడు, లీలామోహన్ తదితరులను ఎన్ను కున్నట్లు వనమాలి నాయుడు తెలిపారు. తమ సంఘం ఆధ్వర్యంలో కాలనీలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషిచేస్తామన్నారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 14: పట్టణంలోని కైలాసగిరికాలనీలో వినాయక చవితిని పురస్క రించుకుని ఏర్పాటు చేసిన వినాయకుడిని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

రేణిగుంట, సెప్టెంబరు 14: గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధి లోని అడుసుపాళెం గ్రామంలో చోటు చేసుకుంది. గాజులమండ్యం పోలీసుల కథనం మేరకు.. అడుసుపాళెం గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తి మతిస్థిమితం లేకుండా తిరుగుతుండే వాడు. గ్రామస్తులు ఆహారం అందించేవారు. ఈ క్రమంలో శనివారం అతడు మృతిచెందాడు. పోలీ సులు కేసు నమోదు చేశారు.

గుడిమల్లంలో అన్నదానం

ఏర్పేడు, సెప్టెంబరు 14: గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులకు అన్నదానం చేశారు. వినాయక ఉత్సవాల్లో భాగంగా శనివారం వినాయక నిమజ్జనం కార్య క్రమంలో సుమారు 500 మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడు, ఈవో రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 14: మండల కేంద్రంలో ఆటో వాలాలు ట్రాఫిక్ నింబంధనలు పాటించకపోతే కేసులు నమోదు చేస్తామని సీఐ తిమ్మయ్య హెచ్చరించారు. మండల కేంద్రంలో ప్రధాన రహదారిలో శనివారం ట్రాఫిక్ అంతరాయం కలిగించిన పలు వాహ నాలకు జరిమానా విధించారు. ఎస్‌ఐ విశ్వనాథ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలపై శిక్షణ

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 14: శ్రీకాళహస్తి మండలం ఎల్లంపల్లి ఎస్టీకాలనీలో శనివారం ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో పిల్లల తల్లిదండ్రులకు జీవన నైపుణ్యాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రగతి సంస్థకు చెందిన రామచంద్ర మాట్లాడుతూ పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు తీసుకో వాల్సిన జాగ్రత్తలు, చదువు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అంగ న్వాడీ టీచర్ పోలమ్మ, సంఘమిత్ర అమల, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇసుక రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు

ఏర్పేడు, సెప్టెంబరు 14: తొండమనాడు -ముసలిపేడు గ్రామాల సరి హద్దుల్లో ఉన్న స్వర్ణముఖి నది ప్రాంతంలో ఇసుకాసురులను గ్రామస్తులు శనివారం అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన ట్రెంచ్‌ను ఇసుకాసురులు పూడ్చివేయడంపై ఆగ్రహించారు. మళ్లీ ట్రెంచ్ తవ్వారు.

మందుబాబులకు జరిమానా

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 14: బహిరంగ ప్రదేశాల్లో పట్టుబడ్డ మందు బాబులకు జరిమానా విధించినట్లు శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ గోపి తెలి పారు. శ్రీకాళహస్తి 1టౌన్ పరిధిలోని పలు శివారు ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం సేవిస్తూ పట్టుబడ్డ 12మందికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడుపుతున్న ఓ యువకుడికి రూ.10వేలు, పట్టణంలో ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న మరో 25మందికి న్యూసెన్స్ యాక్ట్ కింద రూ.వెయ్యి జరిమానా విధించారు.

గుమ్మడి మురళికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



ఏర్పేడు, సెప్టెంబరు 14: సర్వేపల్లి రాధా కృష్ణన్ జయంతిని పురస్కరిం చుకుని రెండు తెలుగు రాష్ట్రాల్లో చేపట్టిన సర్వే ఆధారంగా ఏర్పేడు మండలం మన్న సముద్రం గ్రామానికి చెందిన గుమ్మడి మురళిని శ్రీసర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ ఎక్సెలెన్ అవార్డు 2024కు ఎంపికయ్యారు తిరుపతి విశ్వం హైస్కూల్ వేదికగా శనివారం జరిగిన కార్యక్రమంలో రాధా కృష్ణన్ మనుమడు సుబ్రహ్మణ్యశర్మ చేతుల మీదుగా యువతేజం ట్రస్టు, కలం విజన్ ట్రస్టు వారు గుమ్మడి మురళికి అవార్డును అందజేశారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

లోక్ అదాలత్ తీర్పు అంతిమం



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 14: లోక్ అదాలత్ తీర్పు అంతిమమని 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీని వాస్‌నాయక్ అన్నారు. శ్రీకాళహస్తి న్యాయస్థాన భవనంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం జరిగింది. సుమారు రూ.89లక్షలు నగదు సంబంధిత 670 కేసులను పరిష్కరించారు. శ్రీకాళహస్తి సీనియర్ సివిల్ జడ్జి బేబీరాణి, జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియ, ప్రభుత్వ శాఖల అధికారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

వైద్యుల ఆందోళన.. పీహెచ్‌సీలో వైద్య సేవలు బంద్

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 14: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీజీ వైద్యలో ఇన్‌సర్వీస్ కోటా కుదింపును వ్యతిరేకిస్తూ వైద్యులు శని వారం ఆందోళన చేపట్టారు. దీంతో వైద్య సేవలు నిలిచి పోయాయి. వైద్యం కోసం వచ్చిన రోగులు ఇబ్బందులు పడ్డారు. ఈ సందర్భంగా వైద్యాధికారి దివాకర్ మాట్లా డుతూ జీవో 85 వలన 336 సీట్లు నష్టపోతామని, దీంతో ప్రభుత్వాసుపత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యుల కొరత ఏర్పడు తుందన్నారు. ఇన్ సర్వీసు కుదింపు జీవోను రద్దు చేయాలని కోరారు.

సకాలంలో రుణాలు చెల్లించండి

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 14: మండలంలో యానాది సమాఖ్య సభ్యులు సకాలంలో తీసుకున్న రుణాలను చెల్లించి రుణ పరి మితిని పెంచుకోవాలని వెలుగు ఏపీఎం ఇందిరాగాంధీ తెలిపారు. మం డల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో మండల యానాది సమాఖ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదాయం వచ్చే వ్యాపా రాలను చేస్తే తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించ వచ్చునన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్

ఏర్పేడు, సెప్టెంబరు 14: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పాపా నాయుడుపేట వద్ద పోలీసులు పట్టుకున్నారు. స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ యజమానులపై కేసు నమోదు చేశారు.

కిక్కిరిసిన ముక్కంటి ఆలయం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 14: శ్రీకాళహస్తీశ్వరాలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. వరుస సెలవులు కావడం తో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే గాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 26వేల మంది భక్తులు దర్శించు కున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రజా సమస్యలపై మంత్రులకు వినతి



మంత్రి నిమ్మలతో చలపతినాయుడు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 14: శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని పలు ప్రజాసమస్యలపై స్థానిక టీడీపీ నేత, రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు పలువురు మంత్రులకు విన్నవించారు. ఈ మేరకు విజయవాడలోని సచివాలయంలో శనివారం ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, పురపాలకశాఖ మంత్రి నారాయణ, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్, హోంమంత్రి వంగలపూడి అనిత, ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయా శాఖల పరిధిలోని ప్రజా సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. మంత్రులు సానుకూలంగా స్పందించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు చలపతినాయుడు తెలిపారు.

జీవన నైపుణ్యాలు మానవుడి ఉన్నతికి సోపానాలు



మాట్లాడుతున్న సైకాలజిస్టు సుధాకర్‌రెడ్డి

ఏర్పేడు, సెప్టెంబరు 14: జీవన నైపుణ్యాలు వ్యక్తి ఉన్నతికి సోపానాలుగా మారుతాయని ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ ఎస్‌బీ సుధాకర్‌రెడ్డి చెప్పారు. మండలంలోని నాగంపల్లి వద్ద ఉన్న ఎస్‌వోఎస్ బాలల గ్రామంలో శనివారం 120 మంది పిల్లలకు జీవన నైపుణ్యాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహిం చారు. ఆరోగ్యకరమైన ఆహారం, శరీర శుభ్రత, ఒత్తిడిని నియంత్రించుకో వడం వంటి అంశాల ప్రాముఖ్యతను వివరించారు. ఇతరులతో కలిసి పనిచేయడం, విభేదా లను శాంతియుతంగా పరిష్కరించడం, మర్యాదతో మెలగడం వంటి సామాజిక నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. ఎస్‌వోఎస్ సంస్థ ప్రతినిధి మునిరత్నం, యాని మేటర్లు, అక్కుర్తి, ఎస్టీకాలనీ, అరుంధతివాడ, చిన్నాన్నపేట, ఊరందూరు ఎస్సీ కాలనీ, బత్తినయ్య కాలనీ, యలంపల్లి, మేళచ్చూరు తదితర గ్రామాలకు చెందిన పిల్లలు పాల్గొన్నారు.

టీచర్ సురేష్‌కు సన్మానం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 14: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో జరిగిన గురుపూజోత్సవ వేడుకల్లో శ్రీకాళహస్తి మండలం ఉరందూరు జడ్పీ ఉన్నతపాఠశాలకు చెందిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కూనాటి సురేష్‌ను ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జేసీ శుభం బన్సల్, డీఈవో శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే ఆదిమూలంపై కుట్ర

వరదయ్యపాళెం, సెప్టెంబరు 14: రాజకీయ కక్షతోనే ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై కుట్ర చేశారని రాచకండ్రిగ గ్రామస్తులు పేర్కొన్నారు. కుట్రల నుంచి ఆయన బయటపడాలని గ్రామంలోని వినాయక ఆలయంలో గ్రామస్తులు శనివారం పూజలు నిర్వహించారు. అబేంద్కర్ నేషనల్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బాలగురవం, భరణి బాస్, కిషోర్, షైక్ నంద, పుట్టయ్య, మునస్వామి, మురగేష్ పాల్గొన్నారు.

సత్యవేడు: ఎమ్మెల్యే ఆదిమూలం నిర్దోషిగా బయట పడాలని సత్యవేడులో దళిత నాయకుల ఆధ్వర్యంలో పలు ఆలయాల్లో పూజలు చేశారు. నాయకులు ధనశేఖర్, వెంకటరమణ, ధన, వాసు పాల్గొన్నారు.

ఆరుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

వరదయ్యపాళెం, సెప్టెంబరు 14: మండలంలోని బత్తల్లవల్లం పంచాయతీ చెదులపాకం గ్రామంలో శనివారం పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. కేసు నమోదు చేశారు. వారి నుంచి రూ.2,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జున తెలిపారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



నాగలాపురం, సెప్టెంబరు 14: జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న వెంకటేశ్వర్లుకు మండల స్థాయిలో ఉపాధ్యాయులు సన్మానం చేశారు. శనివారం నాగలాపురంలోని ఎమ్మార్సీలో ఎంఈవో బాబయ్య ఆధ్వర్యంలో వెంకటేశ్వర్లకు శాలువలు, పూమాలలతో ఘనంగా సన్మానించారు. ఎంఈవో -2 జనార్ధన్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

సత్యవేడు, సెప్టెంబరు 14: లోక్ అదాలత్‌లో కక్షి దారులు సత్వర న్యాయం పొందడంతో పాటు డబ్బు, సమయం ఆదా అవుతుందని జిల్లా ఎర్రచందనం తిరుపతి కోర్టు న్యాయమూర్తి శ్రీకాంత్ తెలిపారు. శనివారం సత్యవేడు జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు ఆయన ఇన్‌చార్జ్ జడ్జిగా వ్యవహరించారు. ఈ లోక్ అదాలత్‌లో మొత్తం 273 కేసులు పరిష్కరం కాగా ఇందుకు సంబంధించి రూ.51,34,594లు రికవరీ అయినట్లు జడ్జి తెలిపారు. అనంతరం స్థానిక మహాత్మ జ్యోతిబా పూలే బాలుర గురకుల పాఠశాలకు వెళ్లి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటేశులు యాదవ్, న్యాయవాదులు, పోలీస్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



వరదయ్యపాళెం, సెప్టెంబరు 14: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం చెన్నై శంకర్ నేత్రాలయ, మిషన్ ఫర్ విజన్ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 120 మందికి ఈ శిబిరంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. 55మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు.

టీడీపీ నేత గజేంద్రరెడ్డికి మాతృవియోగం

పిచ్చాటూరు, సెప్టెంబరు 14: పిచ్చాటూరు మండలం తులసికృష్ణాపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నేత ఎం.గజేంద్రరెడ్డి తల్లి సరసవేణమ్మ (80) శనివారం గుండెపోటుతో మృతిచెందారు. పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయన్ను పరామ ర్శించారు.

ఏచూరి మరణం పేదలకు తీరని లోటు



సంతాప సమావేశంలో సీపీఎం నాయకులు, కూలీలు

కేవీబీపురం, సెప్టెంబరు 14: మండలంలోని కొత్తూరు గ్రామంలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి శనివారం ఆ పార్టీ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి దాసరి జనార్ధన్ మాట్లాడుతూ ఏచూరి మరణం పేద లకు, వామపక్ష ఉద్యమానికి, సీపీఎంకు తీరని లోటని పేర్కొన్నారు. నాగరాజు, వరలక్ష్మి, సుబ్రహ్మణ్యం, లక్ష్మయ్య, దేవి, కన్నెమ్మ, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, బత్తెమ్మ పాల్గొన్నారు.

నాగలాపురం: సీతారాం ఏచూరి మరణం వామ పక్ష ఉద్యమాలకు తీరని లోటు అని సీపీఎం మండల కార్యదర్శి మురుగేసన్ అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో నాగలాపురంలోని ఉపాధి కూలీలు ఏచూరి సంతాప సభ నిర్వహించారు. సీపీఎం నాయకులు దినమణి, సుబ్బమ్మ, బాలాజీ, అముద పాల్గొన్నారు.

ఏర్పేడు: పాపానాయుడుపేటలో సీపీఎం జాతీయ నాయకులు సీతారాం ఏచూరికి ఆ పార్టీ నాయ కులు ఘనంగా నివాళులు అర్పించారు. సీఐటీయూ మండల కార్యదర్శి కరీముల్లా ఆయన సేవలను కొనియాడారు. రంగయ్య, రాంబాబు, ధర్మారెడ్డి, గిరి, మస్తాన్, కునాల్ తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో చేతిబోరు ఏర్పాటు



శ్మశానంలో ఏర్పాటు చేసిన చేతి బోరు

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 14: మండలంలోని గాజుల పెళ్లూరు గ్రామ శ్మశానం కోసం గ్రామానికి చెందిన విశ్రాంత రైల్వేస్టేషన్ మాస్టరు ధనంజయులురెడ్డి రూ.60వేల సొంత నిధులతో తాగునీటి బోరును వేయించారు. అంత్యక్రియల సమయంలో తాగునీటి కోసం ఇబ్బందులు లేకుండా చేతిబోరును వేయించారు. గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

పుత్తూరు వార్తలు

వైభవంగా అయ్యప్ప ఆలయ మహాకుంభాభిషేకం



ఆలయంలో నిర్వహించిన కలశపూజ

పుత్తూరు, సెప్టెంబరు 14 : పుత్తూరులోని అయ్యప్ప ఆలయంలో జీర్ణో ద్ధారణ అష్టబంధన మహా కుంభాభి షేకం కార్యక్రమాలు నాలుగు రోజులుగా వైభవంగా జరుగు తున్నాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా విఘ్నేశ్వర పూజలు, యజ్ఞహోమాలు, గోపూజలు, పూర్ణాహుతులు, నవగ్రహ హోమాలు వరుసగా జరుగుతున్నాయి. చివరి రోజైన 15వ తేదీ ఆదివారం ఉదయం మహా కుంభాభిషేకం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం ఊరేగింపు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొనున్నారని అయ్యప్ప సేవా సమాజం తెలిపింది.

రాజీతో కేసులు సత్వర పరిష్కారం

పుత్తూరు, సెప్టెంబరు 14: రాజీతో కేసులు సత్వరమే పరిష్కరించు కోవచ్చని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర తెలిపారు. పుత్తూరు కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో 441 కేసులు పరిష్కారం కాగా వీటికి సంబంధించి రూ.1,83,74,781లు రికవరీ చేసినట్లు తెలిపారు. లోక్ అదాల్ తీర్పు అంతిమమని వివరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు, పోలీసులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు రూ.25 వేల విరాళం



ఎమ్మెల్యే భానుకు చెక్కును అందిస్తున్న మధునాయుడు

పుత్తూరు టౌన్, సెప్టెంబరు 14: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌కు పట్టణానికి చెందిన బొల్లినేని మధునాయుడు రూ.25వేలు విరాళం అందించారు. నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్‌ను కలిసి చెక్కును అందించారు. ఈ సందర్భంగా మధునాయుడు మాట్లాడుతూ తనతండ్రి జయరాం నాయుడు 8వ వర్ధంతి సందర్భంగా విరాళం అందించినట్లు ఆయన తెలిపారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న చట్టాలు

పుత్తూరు టౌన్, సెప్టెంబరు 14: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులు కాలరాసేలా చట్టాలను తీసుకొచ్చిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ విమర్శించారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మండల కమిటీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బిల్డింగ్ వర్కర్స్ సంక్షేమ బోర్డుకు నిధులు కేటాయించాలని, ఆటో వర్కర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, అంగన్వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రం చేస్తామని స్పష్టంచేశారు.ఈ సంద ర్భంగా పుత్తూరు సీఐటీయూ నూతన సమన్వయ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా విజయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కో-కన్వీనర్‌గా లలిత, సభ్యులుగా లక్ష్మణ్‌కుమార్, దస్తగిరి, భాస్కర్, పురుషోత్తం, యాసిన్, శివ, మునికుమారి, విజయ కుమారి, రాధా, నరసిం హులు, గోవిందరెడ్డి, అరుణ, కృష్ణయ్య, ప్రశాం త్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి ప్రసాదరావు పాల్గొన్నారు.

సర్దార్ బాలకృష్ణయ్య మృతి తీరనిలోటు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

వడమాలపేట, సెప్టెంబరు14: మండలంలోని పాదిరేడుకు చెందిన టీడీపీ నాయకులు సర్దార్ బాలకృష్ణయ్య మృతి పార్టీకి తీరనిలోటని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. శుక్ర వారం రోడ్డుప్రమాదంలో బాలకృష్ణయ్య మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎమ్మెల్యే శనివారం గ్రామా నికి చేరుకుని ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. కాగా పాదిరేడు బైపాస్ రోడ్డు వద్ద తరచూ జరు గుతున్న రోడ్డు ప్రమాద విషయాలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే ఎన్‌హెచ్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పాదిరేడు బైపాస్ వద్ద ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.